AL - HiLaL

నవతరం

మాసపత్రిక

రబీఉల్ అవ్వల్ మాసం హిజ్రీ శకం 1434

Vol 8, Issue: 64 February - 2012

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى

దేశాభిమానం



IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

جمعية النجاة الخيرية

telgo fbrvry.indd 1 2/12/12 4:07 PM

విశ్వ కారుణ్యమూర్తి ముహమ్మద్ ﷺ

"ఈ సందేశహరుణ్ణి, నిరక్షరాసి అయిన ఈ ప్రవక్తను అనుసరించేవారు (కరుణించబడతారు). అతని ప్రస్తావన వారి వద్ద ఉన్న తౌరాతు, ఇంజీలు గ్రంథాలలో లిఖితపూర్వకంగా లభిస్తుంది. ఆ ప్రవక్త మంచిని చెయ్యమని ఆదేశిస్తాడు. చెడుల నుంచి వారిస్తాడు. పరిశుద్ధమైన వస్తువులను ధర్మసమ్మతంగా ప్రకటిస్తాడు. అశుద్ధమైన వాటిని నిషిద్ధంగా ఖరారు చేస్తాడు. వారిపై ఉన్న బరువులను దించుతాడు. వారికి వేయబడి ఉన్న సంకెళ్లను (విప్పుతాడు). కనుక ఎవరు ఈ ప్రవక్తను విశ్వసించి, అతనికి ఆదరుగా నిలుస్తారో, తోడ్పాటు నందిస్తారో, ఇంకా అతనితోపాటు పంపబడిన జ్యోతిని అనుసరిస్తారో వారే నిజమైన విజేతలు". (దివ్య ఖుర్ఆన్- 7: 157)

సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

AL-HILAL

వెలువరక

(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 64
February 2012

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....



సామ దాన భేద దండోపాయం



బహు బార్యాత్వం



అల్లు తెచ్చిన ముల్లు

"ఎవరి వల్లనయితే ప్రజలకు ఎక్కు మేలు జరుగుతుందో అతడే అందరికంటే ఉత్తముడు"

దేశాభిమానం	2	పూ పరిమళం	12
సామ దాన భేద దండోపాయం	4	కవితా కుసుమాలు	13
ప్రపంచంలోని ప్రముఖ ధర్మాల...	6	రుచి – అభిరుచి	14
ప్రపంచ ధర్మాల్లో దైవభావన	7	ప్రవాసాంధ్రులకు	15
ఇమామ్ బుఖారీ (ర)	8	ఐపిసి వార్తలు	16
బహు బార్యాత్వం	10	సుభిక్షం దుర్భిక్షం	18

حب الوطن والإسلام - أربع حيل خلاف الإسلام - تصور الإله في الأديان المعاصرة - تعريف إمام بخاري - تعدد الزوجات و الإسلام - جوامع الكلم - نشيد عن سيرة النبي ﷺ - طبخ الكويتي - نصائح للوافدين - أخبار اللجنة - حق السائل والمحروم في الإسلام - سيرة ملخصة عن النبي ﷺ



దేశాభిమానం

ప్రేమ మనిషి నైపుణ్యాన్ని మెరుగులు దిద్ది, అతని ప్రతిభాపాటవాలను ప్రగతి పథంలో పయనింపజేసి, అతనిలో సృజనాత్మక శక్తిని పెంపొందించి, నిర్మాణాత్మక వ్యక్తిత్వాన్ని ప్రసాదిస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ కోవకు సంబంధించినదే దేశాభిమానం. ఏ నేలలోనైతే తను జీవం పోసుకున్నాడో, ఏ నేలలోనైతే తను సభ్యతాసంస్కారాలు నేర్చుకున్నాడో, ఏ నేలలోనైతే తన ఆప్తులు, కన్నవారున్నారో ఆ నేల కోసం తన, ధన, మానాలను సయితం త్యాగం చెయ్యడానికి సిద్ధమవుతాడు మనిషి. అలా సిద్ధమయినవాడే దేశాభిమాని. ఆ విషయంలో అగ్రభాగాన ఉంటాడు ముస్లిం.

కరుణ, సత్యాలే ఆయుధాలుగా మానవ జాతిని మోక్ష మార్గాన నడిపిన మహా ప్రవక్త (స), మానవ జాతి దాస్య విముక్తికై రాజీ లేని పోరు సలిపిన మహా ప్రవక్త (స), స్వార్థచింతన లేకుండా మానవాళి ఇహపరాల సాఫల్యాల కోసం అహరహం శ్రమించిన మహా ప్రవక్త (స), జాతి, కులం, భాష, ప్రాంతం అంటూ ఎవరికి వారుగా ఉన్న మానవ జాతిని **'మీరంతా ఆదంతో, అదం మట్టితో' – మీరంతా పరస్పరం దైవదాసులుగా, అన్నదమ్ములుగా మసలుకోండి, మీ కోసం దేన్నయితే ఇష్ట పడతారో మీ సోదరుల కోసం సయితం వాటినే ఇష్టపడండి. మిమ్మల్ని మీ తాతముత్తాతల్ని పుట్టించిన ఒకే ఒక్క సృష్టికర్త అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి'** అని అందరిని ఏకతాటి మీదకు తీసుకు వచ్చిన మహా ప్రవక్త (స), సంకల్ప శుద్ధి, ఆత్మ పవిత్రత, నిర్మల మనస్తత్వం, నిస్వార్థ సేవ స్వర్గ లక్ష్య సిద్ధికి చేరువ చేస్తాయని ఎరుకపరచిన మహా ప్రవక్త (స), రవి అస్తమించని సామ్రాజ్యాలుగా విర్రవీగిన రోమ్, పర్షియన్లను సత్యతా కరావాలంతో మట్టి కరిపించి హృదయాల విజేతగా నీరాజనాలు అందుకున్న మహా ప్రవక్త (స), మూఢాచారాల, మింగుడు పడని సిద్ధాంతాల కాడిని మానవ భుజాల మీద నుండి తొలగించి ప్రవక్తలందరికి నాయకుడుగా, సమస్త లోకాల పాలిట మూర్తీభవించిన కారుణ్యంగా ప్రభుచే ప్రశంస పత్రాన్ని పొందిన మహా ప్రవక్త ముహమ్మద్ (స) సయితం తన జన్మ భూమిని ప్రేమించారు. తను పుట్టిన గడ్డ పట్ల తనకున్న అభిమానాన్ని ఆయన అనేక సందర్భాల్లో వ్యక్త పర్చారు కూడా.

మనుషుల్ని ప్రేమించి వస్తువుల్ని వాడుకోవాల్సింది పోయి, వస్తువుల్ని ప్రేమించి మనుషుల్ని వాడుకొంటున్న దుర్భిక్ష స్థితి మనది. దీని తీరుతెన్నులు మారేదెప్పుడు?

దైవ దౌత్యం ప్రసాదించబడిన తర్వాత – 'నేను కూడా యువకుడినై, ప్రజలు మిమ్మల్ని మీ జన్మ భూమి నుండి బహిష్కరించే కాలం వరకూ బ్రతికుంటే ఎంత బాగుండేది' అని వరఖా బిన్ నౌఫల్ సానుభూతిని కనబరచినప్పుడు, దైవ ప్రవక్త (స) ఆశ్చర్యపోతూ – **"ఏమిటి నా జాతి ప్రజలు నన్ను నా స్వస్థలం నుండి వెలివేస్తారా?"** అని అడిగారు.

తర్వాత దైవాజ్ఞ మేరకు మక్కాను వదలి వెళ్ళ వలసిన సమయం వచ్చినప్పుడు మహా ప్రవక్త ముహమ్మద్ (స) కాబా వైపు ఆఖరి సారి చూస్తూ, **"ఓ మక్కా! నువ్వు నాకు ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రియమైన భూభాగానివి. నా జాతి ప్రజలు నన్ను వెలివేయకుండా ఉండి ఉంటే నేను నిన్ను వదలి వేరే భూభాగంలో నివాసం ఏర్పరచుకునేవాడను కాను"** అన్నారు. (తిర్మిజీ)

ఈ సంఘటన తర్వాత అభయమిస్తూ అల్లాహ్ ఈ వచనాలను అవతరింపజేశాడు: **"(ఓ ప్రవక్తా!) నీపై ఖుర్‌ఆన్‌ను అవతరింప జేసినవాడు నిన్ను తిరిగి పూర్వ స్థలానికి చేర్చనున్నాడు".** (ఖసస్: 85)

నిజం – మనిషికి తన ప్రాణమన్నా, తన దేశం అన్నా వల్ల మాలిన అభిమానం. ప్రాణం పోవడాన్ని, దేశం నుండి వేరవడాన్ని ఏ వ్యక్తి సులభంగా ఇష్ట పడడు. మనిషి ఈ స్వభావాన్నే అల్లాహ్ ఇలా తెలియ జేస్తున్నాడు: 'ఒకవేళ మేము **"మిమ్మల్ని మీరు చంపుకోండి లేదా మీ ఇళ్ల నుంచి వెళ్లిపోండి"** అనే ఆదేశాన్ని వారిపై విధించి ఉంటే, వారిలో బహుకొద్ది మంది మాత్రమే దాన్ని పాటించేవారు'. (అన్నిసా: 66)

ఇబ్రాహీమ్ బిన్ అద్హమ్ (ర) ఇలా అభిప్రాయపడ్డారు: **"నేను అనేకుల్ని మానసికంగా చికిత్స చేశాను. అప్పుడు వారిలో దేశాభిమానం అనేది చాలా బలంగా ఉందన్న విషయాన్ని నేను గ్రహించాను".**

telgo fbrvry.indd 2 2/12/12 4:07 PM

మౌనం



ముహమ్మద్ గజాలీ ఇదే విషయమై ఇలా అన్నారు: "మనుషులు తమ స్వస్థలం పట్ల అందలి వస్తువుల పట్ల, అభిమానం కలిగి ఉంటారు. చివరికి అది నిర్జన అరణ్య ప్రాంతమైనా సరే. దేశాభిమానం మానవ హృదయాల్లో వేళ్లూనుకొని ఉంటుంది. ఆ కారణంగానే మనిషి తన దేశంలో నివాసం ఉండటానికి ఇష్ట పడతాడు. ఒకవేళ ఏదైనా అనివార్య కారణాల వల్ల దేశం వదలి వెళ్ళ వలసివచ్చినా తిరిగి వచ్చేంత వరకు హృదయం స్వదేశ దర్శనానికై పరితపిస్తూనే ఉంటుంది. ఈ కారణంగానే తన దేశం గురించి ఎవరైనా చెడుగా మాట్లాడితే సహించడు మానసం గల మనిషి. ఒకవేళ దాన్ని కబళించాలని ఎవరైనా చూస్తే భరించడు అత్మాభిమానం గల మనీషి. పై పేర్కొనబడిన అభిమానం వల్లనే కువైటీ ప్రజలు తమ దేశ స్వాతంత్రదినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకుంటారు. మన దేశ ప్రజలూ ఎందరో ప్రతి ఏడాది కువైట్‌లోని మన దేశ దౌత్య కార్యాలయం నిర్వహించే స్వాతంత్ర్య, గణతంత్ర సంబరాల్లో పాల్గొనడం శుభ సూచకమే. కానీ, వారి సంఖ్య బహు స్వల్పం. భారతీయులు – వారు ఏ మతస్థులైనా ఈ విషయమై నిశితంగా ఆలోచించాలి. ఇకపోతే –,

ఆరుగాలం శ్రమించి జాతి ప్రాణాలు నిలిపే ఆహారాన్ని అందించేది రైతులైతే, అన్ని కాలాల్లో ఎన్నో కష్టాలకోర్చి ప్రజల ప్రాణాలు కాపాడేది సరిహద్దు సైనికులు. దేశ రక్షణ కోసం అంకితమై, స్వంత జీవితానికి దూరమై, ప్రాణాన్ని పణంగా పెట్టి, కొండల్లో, కోనల్లో, మండే ఎండల్లో, వణికించే చలి మంటల్లో అహర్నిశలు తమ బాధ్యతను నిర్వహించే త్యాగధనులు వీర సైనికులు. మనం ఈ రోజు హాయిగా గుండె మీద చేయి వేసుకుని ఉండటానికి కారకులు వారు. వారి త్యాగం వెలకట్టలేనిది. అలా ఎందరో ఎన్నో త్యాగాలు చేశారు, ఎన్నో పథకాలు అమలు పర్చారు. వారందరి లక్ష్యం ఒక్కటే – మానవ జాతి స్వేచ్ఛా వాయువుల్లో జీవించాలి. ప్రతి మనిషికి ఆత్మగౌరవంతో బ్రతికే కనీస సౌకర్యం కలుగుజేయాలి.

సిద్ధాంత, సంక్షేమ రహిత రాజకీయాలు, శ్రమ రహిత సంపద, నీతిరాహిత్య వ్యాపారం, నైతికత శూన్య విద్య, హృదయ రహిత ఆనందం, మమత కరువైన (మర) జ్ఞానం, ఆత్మశుద్ధి లేని ఆరాధనలతో నేడు ముప్పూటలా కడుపు నిండా మెక్కే నాయకులకు ఆ రైతుల గోడు అర్థం కాదు. స్వార్థ ప్రయోజనాల కోసం మారణ హోమాన్ని సృష్టిస్తున్న అల్ప బుద్ధి అలగాజనాలకు, మత ఛాందస వాదులకు ఆ సైనికుల త్యాగం బోధ పడదు. పదవికి కావాల్సింది కులం, వారసత్వం, ఆకర్షణ కాదు. పదవి అంటే ప్రజలకు సేవ చెయ్యడానికి లభించిన సువర్ణావకాశం అని కుయుక్త హృదయులకు అర్థమయయ్యేది ఎప్పుడు? మన జాతి గతి సుగతి అయ్యేదెప్పుడు? మనుషుల్ని ప్రేమించి వస్తువుల్ని వాడుకోవాల్సింది పోయి, వస్తువుల్ని ప్రేమించి మనుషుల్ని వాడుకొంటున్న దుర్భిక్ష స్థితి మనది. దీని తీరుతెన్నులు మారేదెప్పుడు?

మనం తయారు చేసుకునే బొమ్మకి అందమైన ఆకారం కావాలంటే చక్కనైనా నమూనా ఎంచుకోవాలి. సేవ చేసే నాయకులు కావాలంటే **'ఖలీఫా అబూ బకర్ మరియు ఉమర్ (ర)'**ల గురించి గాంధీ గారు చెప్పి మాటలు గుర్తు తెచ్చుకోవాలి. అలాంటి నాయకుల్ని మనమే ఎంచుకోవాలి లేదా తయారు చేసుకోవాలి. అప్పుడుగాని అనేక సమస్యలతో సతమతమవుతున్న బ్రతుకులు తెప్పరిల్లవు.

"స్వాంతత్ర్యం వచ్చింది...దేశం మనదైంది...అని ఇష్ట వచ్చినట్లు ప్రవర్తించలేము. ఇప్పుడే మనం మరింత క్రమశిక్షణతో, ఆత్మనిగ్రహంతో మసలుకోవాలి. అన్యోన్య సౌహార్దామృతంతో భారతావనిని అగ్రగామి చేయాలి" అన్న ఓ మేధావి మాట మనందరికి స్ఫూర్తి కావాలి.



మూఢాచారాల, మింగుడు పడని సిద్ధాంతాల కాడిని మానవ భుజాల మీద నుండి తొలగించి ప్రపంచాన్ని ఏలే నాయకుడుగా ప్రభుచే ప్రేషిత పత్రాన్ని పొందిన మహా ప్రవక్త ముహమ్మద్ (స) నయితం తన జన్మ భూమిని ప్రేమించారు. తమ పుట్టిన గడ్డ వల్ల తనకున్న అభిమానాన్ని అయిన అనేక సందర్భాల్లో వ్యక్త పర్చారు కూడా.

telgo fbrvry.indd 3 2/12/12 4:07 PM

కరటాల నురుగు చూసి, సాగర సామర్థ్యాన్ని అంచనా వేసి నట్లు, మక్కా ప్రజలు ప్రవక్త ముహమ్మద్ (స) వారి సందేశాన్ని చిన్న చూపు చూశారు. దాన్ని చాలా తేలికైన విషయంగా భావించారు. ఆయన (స) సందేశం సత్య సస్య విప్లవానికి నాంది అని వారు ఆ క్షణంలో గ్రహించలేకపోయారు. జీవిత వాస్తవమే సత్యం. దాని ఆది ఏ గర్భంలోనూ లేదు. దాని అంతం ఏ సమాధిలోనూ లేదు. అది నిత్యం, నూతనం, నిర్మలం. అది నిజం– మారని ఇజం. ఇది గ్రహించే స్థితిలో లేని మక్కా అవిశ్వాసులు సత్య సస్య విప్లవ జ్యోతిని తమ నోళ్ళుతో ఊది అర్పివేయాలని ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో వారు అవలంబించిన విధానం – సామ, దాన, భేద, దండోపాయం. అదేలాగంటే–,



'ఒక సంవత్సరం కాలం పాటు నీవు మా దేవతలను పూజిస్తే, (ప్రతిగా) ఒక సంవత్సరం కాలం పాటు మేము నీ ఆరాధ్య దైవాన్ని పూజిస్తాము' అని అవిశ్వాసులు మహా ప్రవక్త (స) వారి ముందు ఓ ప్రతిపాదన పెట్టారు. అది విన్న మహా ప్రవక్త ముహమ్మద్ (స) దివ్యావిష్కృతి ద్వారా అందిన సమాధానాన్ని వారికి విన్పించారు: **'(ఓ అవిశ్వాసుల్లారా! మీరు మీ మిథ్యా దేవీదేవతలను వదులుకోవడానికి సిద్ధంగా లేనప్పుడు నేను నా నిజ దైవాన్ని ఎందుకు వదులుకోవాలి. నేను నా ధర్మంపై సంతోషంగా ఉన్నాను. మా కర్మలు మావి. మీ కర్మలు మీవి".** (అల్ ఖసస్: 55)



పరస్పర సలహాసంప్రదింపుల (సామ పద్ధతి) ద్వారా సమస్య తేలేటట్టు లేదని గ్రహించిన మక్కా అవిశ్వాసులు మరో కుయుక్తి సిద్ధమయ్యారు. అదే పని మీద ఉత్బా అను రాయబారిని మహా ప్రవక్త (స) వారి వద్దకు పంపారు.



ఉత్బా: నాయనా ముహమ్మద్! అనుభవంలోనూ, ఆయుష్షులోనూ నేను నీకన్నా పెద్దవాడను. నా మాట విను. నేను చెబుతున్నది నీ మేలు కోరే – నీ ఈ ప్రచారాన్ని మానుకో. ఒకవేళ నువ్వీ పని చేయడంలోని ఉద్దేశ్యం – సిరిసంపదలు కూడబెట్టుకోవడమే అయితే చెప్పు. మేమే స్వయంగా కనక సామగ్రినంతా నీ కాళ్ళ దగ్గర పడవేస్తాము. ఒకవేళ సమాజంలో గౌరవమర్యాదల కోసం నువ్వీ పని చేస్తున్నట్లయితే చెప్పు. మేము నిన్ను మా నాయకుని గా చేసుకుంటాము. ఒకవేళ నువ్వీ కార్యం వల్ల అధికారాన్నే కాంక్షిస్తున్నయితే చెప్పు. మేము నిన్ను పూర్తి అరబ్బు దేశానికే రాజుగా చేసుకుంటాము. పోని నీ ఈ ప్రచారం వెనకాల స్త్రీ వ్యామోహం పని చేస్తున్నట్లయితే ఫరవాలేదు చెప్పు. పూర్తి అరబ్బు దేశంలోని అందమైన స్త్రీని నీకిచ్చి పెళ్ళి చేస్తాము. లేదా నీ మెదడుకేమైనా రోగం సోకిందా, నీకేదైనా భూతం పట్టిందా చెప్పు. మంచి వైద్యుణ్ణి పిలిపించి చికిత్స చేస్తాము. నువ్వు అడిగిందల్లా ఇవ్వడానికి, నీవు కోరిందల్లా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము. నీకేం కావాలో నిర్మోహమాటంగా అడుగు. కానీ నీ ఈ సందేశ ప్రచారాన్ని మానుకో' అని (దాన పద్ధని ముందుంచి) మాట పూర్తి చేశాడు ఉత్బా.



telgo fbrvry.indd 4 2/12/12 4:07 PM

దైవసాక్షి! వీరు నా కుడి చేతిలో సూర్యుణ్ణి, ఎడమ చేతిలో చంద్రుడ్ని తెచ్చి పెట్టి ఈ మహా కార్యం మానుకోమన్నా అది జరిగే పని కాదు. వినండి, ఈ మహా కార్యం పూర్తయినా పూర్తి కావాలి. లేదా ఈ మార్గంలో నా ప్రాణమైనా పోవాలి .

సాంతం విన్న మహా ప్రవక్త (స) అతనితో **"ఇప్పటి వరకూ నువ్వు నాతో అన్న మాటల్లో ఇసుమంతయినా నిజం లేదు. ఆ విషయం నీకు తెలియంది కాదు. ఈ కార్యం ద్వారా ఎలాంటి సిరిసంపదలు, పరువుప్రతిష్టలు నాకక్కరలేదు. నేను దీని ద్వారా అధికారాన్నిగానీ, ఆడదాన్నిగాన్నీ కోరుకోవడం లేదు. నా ఆరోగ్య స్థితి కూడా బాగానే ఉంది. నాపై అవతరించిన గ్రంథంలోని ఈ వాక్యాలు విను. నా సందేశంలోని వాస్తవికత ఏమిటో నీకే బోధ పడుతుంది"** అంటూ పవిత్ర ఖుర్‌ఆన్ పారాయణం మొదలు పెట్టారు. హామీమ్ అస్సజ్దాలోని ప్రారంభ వాక్యాలను చదివి విన్పించారు.

అరచేతిని నేలకు ఆనించి తల భుజంపై వాల్చి మహా ప్రవక్త (స) వారి నోట నుండి వెలువడుతున్న దివ్య ఖుర్‌ఆన్ సూక్తుల్ని తన్మయుడై వినసాగాడు. అంతా విన్న తర్వాత మారు మాట్లాడ కుండా లేచి ఖురైషు దగ్గరకు చేరుకుని: **'ఖురైషీయుల్లారా! నేనో అద్భుతమైన వాణిని విని వచ్చాను. అది కవిత్వం కాదు. చేతబడి అంతకన్నా కాదు. మంత్రజాలం అసలే కాదు. మీరు నా మాట వినండి! ముహమ్మద్ (స)ను అతని మానాన అతన్ని వదిలెయ్యండి'** అన్నాడు. ఈ వైఫల్యం తర్వాత అవిశ్వాసులకు ఎటూ పాలుపోలేదు. చివరికి సర్దారులందరూ వెళ్లి ప్రవక్త (స) వారి బాబాయి అబూ తాలిబ్‌తో మాట్లాడాలన్న నిర్ణయానికి వచ్చారు. అంటే భేద పద్ధతికి ప్రారంభం అన్న మాట.

ఖురైషీయులు: 'అబుతాలిబ్ మహాశయా! మీరు మా పెద్దలు. మీ పట్ల మా హృదయంలో ఎంత గౌరవం ఉందో మీకు తెలుసు. ముహమ్మద్ విషయంలో మాకు న్యాయం చేయండి. అతడ్ని కాస్త మందలించండి. మా మతాన్ని, మా ఆచార విధానాల్ని విమర్శించ వద్దని నచ్చజెప్పండి. లేదా మా దారి నుండి తప్పు కోండి' అన్నారు. అది విన్న అబూతాలిబ్ ప్రవక్త(స)ను పిలిపించి బాబూ ముహమ్మద్! నీ పద్ధతి మార్చుకో అన్నారు.

ముహమ్మద్ (స): 'బాబాయీ! ఎందులో వారి శ్రేయస్సు, సంక్షేమాలు దాగి ఉన్నాయో దాని వైపు వారిని పిలవడం మానెయ్య మంటున్నారా?'.

అబూ తాలిబ్: 'అదేమిటి? ఎందులో ఉంది వారి శ్రేయస్సు'?

ముహమ్మద్ (స): ఒక సద్వచనం. దీన్ని గనక వారు మనసా వాచ, కర్మణ–త్రికరణ శుద్ధితో అంగీకరిస్తే అరేబియా, అరబ్బేతర దేశాలు వారికి దాసోహం అంటాయి.

అబూ జహల్: ముహమ్మద్ నువ్వు విశ్వసించే ఆ దేవుని సాక్షి! ఆ మాటేమిటో చెప్పు, ఇప్పుడే అలాంటివి ఒకటేమిటి ఖర్మ, పాతిక మాటలు పలకటాని మేము సిద్ధంగా ఉన్నాము అన్నాడు కుతుహలంతో.

ముహమ్మద్ (స): ఖూలూ లా ఇలాహ ఇల్లల్లాహ్ తుఫ్లిహూ' – కేవలం అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదని చెప్పండి. సాఫల్యం మీ సొంతం అవుతుంది. దైవప్రవక్త (స) వారి నోట ఈ మాట వినగానే అక్కడున్న వారి ముఖాలు కోపంతో ఎర్రబడ్డాయి. **'చూడు చివరికి నీ గతి ఏమవుతుందో"** అంటూ లేచి చరచరా వెళ్ళిపోయారు.

అయినా ఇస్లామీయ ఉద్యమం ఉధృతం అవుతూనే ఉంది. ఉమర్, హమ్జా లాంటి పరాక్రమవంతులు కూడా ఇస్లాం స్వీకరించారు. మరోవైపు నజాషీ రాజు ముస్లింలను తన రాజ్యంలో రక్షణ కల్పించాడు. అది విస్తరించే కొద్దీ వారి మనోవేదన సయితం అధికమవుతూ ఉంది. దినదిన ప్రవర్ధమానమవుతున్న ప్రవక్త (స) వారి సహచరుల సంఖ్యను చూసి వారు మరింత కలవర పడ్డారు. కొంగ్రొత్త వ్యూహాలను రచిస్తూ, అలగా జనాలను ఉసిగొల్పారు. దాంతో వారు విశ్వాసులకు పెట్టే హింసలు మిన్నంటాయి. దైవ ప్రవక్త (స)ను, ఆయన వంశం వారిని సంఘం నుంచి బహిష్కరించాలని పిలుపునిచ్చారు. వారు జారీ చేసిన తీర్మాన పత్రం ప్రకారం – మక్కాలో ఎవరూ హాషిమ్ తెగవారితో ఎలాంటి సంబంధాలు పెట్టుకోరాదు. వారితో ఎలాంటి లావాదేవీలు జరుపకూడదు. వారిని కలుసుకోకూడదు. వారికి అన్న పానీయాలు అందకుండా, కనీస అవసరాలు తీరకుండా గట్టి చర్యలు గైకొనాలి. ఈ దిగ్బంధం మూడేండ్ల పాటు సాగింది. ఈ మధ్య కాలంలో చెట్టు ఆకుల్ని తిని బ్రతికారు. ఎండు చర్మాన్ని నీళ్ళల్లో నానబెటుట్టుకుని కడుపు మంట చల్లార్చుకున్నారు. పసి పిల్లల పరిస్థితి అయితే మరీ దారుణం. వారు ఆకలికి తాళలేక బోరున ఏడ్చేవారు. ఆ ఏడ్పుల శబ్దం విని మక్కా అవిశ్వాసులు పగలిబడి నవ్వి పైశాచికానందం పొందేవారు. అయినా ప్రవక్త (స) పోరాట పటిమను ఆపలేదు. చివరికి ఆ గడ్డు ఘడియలు కూడా ముగిశాయి. ధర్మపథంలో ఒకదాని వెంట మరొకటి చొప్పున ముందుకొస్తున్న అనేక సమస్యల్ని అధికమించి రెట్టింపు ఉత్సాహంతో ముందుకు వెళుతున్నారు. అదే సమయంలో ఓ ప్రతిపాదనకు బదులుగా ఆయన నోట ఈ మాటలు వెలువడ్డాయి **"బాబాయి! దైవసాక్షి! వీరు నా కుడి చేతిలో సూర్యుణ్ణి, ఎడమ చేతిలో చంద్రుడ్ని తెచ్చి పెట్టి ఈ మహా కార్యం మానుకోమన్నా అది జరిగే పని కాదు. వినండి, ఈ మహా కార్యం పూర్తయినా పూర్తి కావాలి. లేదా ఈ మార్గంలో నా ప్రాణమైనా పోవాలి".** ఇది జరిగిన కొంత కాలానికి అడుగడుగునా సహాయం అందిస్తూ వచ్చిన అబూ తాలిబ్, తనను వెన్ను తట్టి ప్రోత్సహించిన ప్రియ సతీమణి ఖదీజా (ర) పరమపదించారు. దీంతో అవిశ్వాసుల భేధం, దండోపాయంగా రూపు దాల్చింది. వారి అసభ్య ప్రహేళి కలు, తుంటరి చేష్టలు విపరీతమయ్యాయి. ఒకడు ఆయన (స) పై బురదపోసి, మరొకడు మెడలో త్రాడు వేసి బిగించి, ఇంకొ కడు దారిలో ముళ్లు పరచి, రాళ్ళతో కొట్టి శారీరకంగా వేధిస్తే, ఇంకొందరు ఆయన కుమార్తెలకు విడాకులిచ్చి మానసికంగా హింసించారు. అయినా ఆయన (స) ఏ మాత్రం నిరాశనిస్పృహ లకు లోను కాలేదు. ఆ రోజుల్లోనే తాయిఫ్ పట్టణానికి కూడా వెళ్ళి ధర్మప్రచారం చేసి వచ్చారు. ఆ కాలంలోనే మేరాజ్ సంఘ టన, మొదటి, రెండవ అఖ్బా ఒప్పందాలు చోటు చేసుకున్నాయి. ముస్లింలు మదీనాకు వెళ్లనారంభించింది కూడా ఆ రోజుల్లోనే. **(మిగతాది 17వ పేజీలో)**

telgo fbrvry.indd 5 2/12/12 4:07 PM

ప్రపంచంలోని ప్రముఖ ధర్మాల వర్గీకరణ



మనం విశాల దృష్టితో పరికించినట్లయితే, ప్రపంచ ధర్మాలన్నింటిని రెండు భాగాలుగా విభజించవచ్చు. ఒకటి **సామి** రెండవది **'సామియేతర'** ధర్మాలు. ఇక సామియేతర ధర్మాల్ని కూడా రెండుగా విభజించవచ్చును. ఒకటి **ఆర్య** మతాలు, రెండవది **ఆర్యేతర** మతాలు.

సామి ధర్మాలు:

సామీలలో బయల్పడిన ముఖ్య ధర్మాల్ని సామి(సెమిటిక్) ధర్మాలంటారు. బైబిలును అనుసరించి మహనీయ నూహ్(అ) ఒక కుమారుని పేరు **'సామ్'** ఉండేది. అతని ద్వారా వచ్చిన సంతతినే **'సామి సంతతులు'** అంటారు. అందుకని యూదులు, అరబ్బులు, ఆశూరీలలో బయల్పడ్డ ధర్మాలు **'సామిధర్మాలు'**గా గుర్తింపు పొందాయి. యూదమతం (జూడాయిజం), క్రైస్తవం మరియు ఇస్లాం, సామిధర్మాల్లో ప్రఖ్యాతి గాంచిన గొప్ప ధర్మాలు. ఇవన్నీ కూడా దైవదౌత్యాన్ని ప్రతిపాదించే ధర్మాలే. అంటే దైవం మానవుల సంస్కరణ, సన్మార్గం పొందుటకై ప్రవక్తల ద్వారా తన ఆదేశాలను మానవులకు అందిస్తాడని విశ్వసించే ధర్మాలు. అనగా ఆకాశ గ్రంథాలను, దైవ వాణిని విశ్వసించే ధర్మాలు అన్నమాట.

సామియేతర ధర్మాలు (నాన్-సెమిటిక్ రిలిజియన్స్)

ఇంతకు ముందే పేర్కొన్నట్లు, సామియేతర ధర్మాల్ని ఆర్యధర్మాలు, ఆర్యేతర ధర్మాలు అని రెండుగా విభజించవచ్చును.

ఆర్య ధర్మాలు:

ఆర్యుల జాతిలో బయల్పడిన ధర్మాల్ని ఆర్య ధర్మాలుగా పేర్కొంటారు. అత్యంత శక్తిమంతులై, ఇండో-యూరోపియన్ భాషలను మాట్లాడే జాతులు ఆర్యజాతులుగా పిలువబడ్డారు. వీరు క్రీ.పూ. 1500 నుండి 2000 వరకు ఇరాన్ మొదలుకొని ఉత్తర భారతం వరకు వ్యాపించారు.

ఈ ఆర్య ధర్మాల్ని కూడా తిరిగి రెండు శాఖలుగా విభజించవచ్చును. ఒకటి వైదిక ధర్మం, రెండవది వైదికేతర ధర్మాలు. వైదిక ధర్మాన్ని సామాన్యంగా హిందూ ధర్మంగా, బ్రాహ్మనిజంగా పేర్కొంటారు. వైదికేతర ధర్మాల్లో సిఖ్ఖు మతం, బౌద్ధమతం, జైన మతం మొదలగునవి వస్తాయి. దాదాపు అన్ని ఆర్య ధర్మాల్లో దైవదౌత్యం (ప్రవక్తల) భావన లేదు.

జోరాష్ట్రియన్ మతం ఒక్కటే ఆర్య ధర్మాల్లోని వైదికేతర ధర్మం, దీనికి హిందూ మతంతో ఎలాంటి సంబంధం లేదు. దైవ దౌత్యపు (ప్రవక్తల) భావన కలిగివున్నట్లు దీని వాదన.

ఆర్యేతర ధర్మాలు:

ఆర్యేతర ధర్మాల పుట్టుక వివిధ ప్రాంతాల్లో జరిగింది. కన్ఫ్యూషినిజం మరియు తావ్‌ఇజం ఉద్భవనం చైనాలో జరిగితే, షింటో ధర్మం జపాన్‌లో వేళ్ళూనుకుంది. ఇలాంటి అనేక ఆర్యేతర ధర్మాల్లో దైవ భావనే కనిపించదు. అందుకని వీటిని సామాన్యంగా ధర్మం అనే బదులు నైతిక బోధనల సముదాయం అంటే సమంజసంగా ఉంటుంది.


ఒక ధర్మంలో దైవభావనను గుర్తించే సక్రమ పద్ధతి:

ఏ ధర్మంలోనైనాసరే, అందులో దైవ భావన ఎంత వరకుంది, ఎలా ఉంది అని తెలుసుకోవటానికి కేవలం దాని అనుయాయుల ప్రవర్తన కొలమానం కాదు. ప్రజల్లో తమ ధార్మిక గ్రంథాల పట్ల అవగాహన లేదన్నది సర్వసామాన్య విషయం. అందుకని ఒక ధర్మంలో దైవ ఉనికి, లేక దైవభావన ఎలా ఉంది, ఎంత వరకు ఉంది అనే విషయం తెలుసుకోవటానికి దాని పవిత్ర గ్రంథాలను అధ్యయనం చేయటమే సరైన మార్గం. ఆ గ్రంథబోధనల వెలుగులోనే ఆ ధర్మంలో గల దైవ భావనను గుర్తించగలుగుతాము.

ఇక ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వివిధ ధర్మాల తాత్విక విశ్లేషణ చేసి, వాటి ధార్మిక గ్రంథాల బోధనల వెలుగులో ఆ ధర్మాల్లో గల దైవ ఉనికిని, దైవ భావనను తెలుసుకోవటానికి ప్రయత్నిద్దాం.

telgo fbrvry.indd 6 2/12/12 4:07 PM

ప్రపంచ ధర్మాల్లో దైవభావన





(ప్రపంచ ధర్మాల్లో దైవభావన' అనే పుస్తకం నుండి)

ప్రపంచ ధర్మాల్లో దైవభావన

ధర్మాలు, వివిధ నైతిక వ్యవస్థలకు, మన సభ్యతా సంస్కృతుల్లో ఓ ప్రత్యేక ప్రాముఖ్యం ఉంది. అనాదిగా మనిషి, తన పుట్టుకకు కారణమేమిటో, ఈ విశ్వంలో తన స్థానమేమిటో, తెలుసుకొనే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. ఈ విశ్వవ్యవస్థలో తన గుర్తింపును, తన స్థానాన్ని తెలుసుకోవటానికి అతడు అన్ని కాలాల్లో ప్రయాస పడ్తూనే ఉన్నాడు.

ప్రఖ్యాత చరిత్రకారుడు, ఆర్‌నాల్డ్ టాయిన్‌బి, యుగయుగాలపై పరివేష్టించి ఉన్న మానవ చరిత్రను నిశితంగా అధ్యయనం చేయటానికి ప్రయత్నించాడు. ఆ తరువాత పది సంపుటాలపై వ్యాపించి ఉన్న తన బృహత్తర కార్యాన్ని ప్రపంచం ముందు ప్రదర్శించాడు. అతను రూపొందించిన ఈ సంపుటాల సారాంశం ఏమిటంటే సమస్త మానవ చరిత్రలో మతమే కేంద్ర స్థానాన్ని ఆక్రమించి ఉంది. క్రీ.శ. 1954, అక్టోబర్ 24వ తేదీ **'ది అబ్జర్వర్'** అనే పత్రికలో ప్రచురింపబడిన తన వ్యాసంలో అతనిలా వ్రాస్తాడు: **"సృష్టి పుట్టుకకు సంబంధించిన రహస్యాన్ని కేవలం ధర్మం మాత్రమే చేదించ గలదని నేను విశ్వసిస్తున్నాను."**

ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో ధర్మాన్ని ఈ విధంగా నిర్వచించటం జరిగింది:**'ఒక మానవాతీత మైన శక్తిపై విశ్వాసముంచటం ప్రత్యేకించి, విధేయతకు, ఆరాధనకు అర్హమైన దేవుడు లేక దేవుళ్ళు ఉనికిపై విశ్వాసముంచటం.'**

ప్రపంచంలోని ప్రఖ్యాత ధర్మాలన్నింటిలో సర్వ శక్తిమంతుడు, లేక సర్వాధికారి అయిన ఒకే దేవుని భావన కనబడుతుంది. అంతేకాక ఈ ధర్మాలను విశ్వసించే వారంతా తామే దేవుణ్ణితే విశ్వసించి ఆరాధిస్తున్నారో, ఆయనే మిగిలిన ప్రజలందరికీ కూడా దేవుడని విశ్వసిస్తారు.

అనేక ధార్మికేతర విశ్వాసాలు లేక సిద్ధాంతాలు ఉదాహరణకు మార్క్సిజం, ఫ్రాయిడిజం మొదలైనవన్ని, సుసంఘటిత ధర్మాల మూలంపై దాడికి ప్రయత్నించాయి. విచిత్రమేమిటంటే ఈ ధార్మికేతర విశ్వాసాలు కూడా, ధార్మికపరమైన విశ్వాసాల రూపాన్ని సంతరించుకున్నాయి.

ఉదాహరణకు అనేక దేశాల్లో కమ్యూనిజం లేక సామ్యవాద వ్యవస్థ ఏర్పడినప్పుడు అక్కడ కూడా ఈ ధార్మికేతర సిద్ధాంతాల్ని, విశ్వాసాల్ని ఒక ధర్మం మాదిరిగానే ఆ తరహాలోనే, అదే సమిష్టిరూపంలో, అదే నిండు హృదయంతో ప్రచారం చేయటం జరిగింది. అంటే ధర్మం మానవ ఉనికికి అనివార్యమైన అంశం అని అర్థమవుతోంది.

దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది ఆయత్‌లో దైవం ఇలా ఉపదేశిస్తున్నాడు– ప్రవక్తా! ఇలా చెప్పు: **"గ్రంథ ప్రజలారా! మాకూ మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి, (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది."** ఈ సందేశాన్ని స్వీకరించటానికి వారు వైముఖ్యం కనబరిస్తే, వారితో స్పష్టంగా ఇలా అను: **"మేము ముస్లిములము (కేవలం అల్లాహ్‌కే దాస్యం చేసేవారు, విధేయత చూపేవారు) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి."**

(ఆలి ఇమ్రాన్ : 64)

ప్రపంచంలోని వివిధ మతాల తులనాత్మక అధ్యయనం, నాకు బాగా లాభించింది. దైవం, ప్రతి మనిషిని తన యొక్క ఉనికిని గుర్తించే జ్ఞానంతో పుట్టించాడనే నా విశ్వాసం, దీనితో ద్విగుణీకృతమైంది. మానవుని, మానసిక నిర్మాణం ఎలా జరిగిందంటే, అతను మహోన్నతమైన ఒక సృష్టికర్త భావనను అవలీలగా స్వీకరిస్తాడు. అలాకాక దేవుడు లేడనే భావనకు అతనికి దృష్టాంతాలు చూపించాల్సి ఉంటుంది. ఇంకో విధంగా చెప్పాలంటే దైవభావనను విశ్వసించటానికి దృష్టాంతం అవసరం లేదు, కాని దైవ భావనను తిరస్కరించటానికి మాత్రం దృష్టాంతాల అవసరం ఏర్పడుతుంది.

telgo fbrvry.indd 7 2/12/12 4:08 PM



ఇమామ్ బుఖారీ (ర)

సహీహ్ బుఖారీ గ్రంథాన్ని సంకలనం చేసిన ఇమామ్ అబూ అబ్దుల్లాహ్ ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ బిన్ ఇబ్రాహీమ్ అల్ బుఖారీ (ర) హిజ్రీ శకం 194, షవ్వాల్ మాసం 13వ తేదీ శుక్రవారం నాడు బుఖారాలో ఒక పేద కుటుంబంలో జన్మించారు. ఆయన పదేళ్ళ ప్రాయంలో విద్యాభ్యాసం ప్రారంభించారు. స్వగ్రామంలో ప్రాథమిక విద్యనభ్యసించిన తరువాత ఉన్నత విద్య కోసం ముస్లిం జగత్తులోని యావత్తు ప్రధాన విద్యాకేంద్రాలన్నీ పర్యటించారు. ఈ సుదీర్ఘ పర్యటనలో ఆయన 1080 మంది ధర్మవేత్తల నుండి హదీసు విద్య నేర్చుకున్నారు. పదేళ్ళ ప్రాయంలోనే ఆయన బుఖారాలో ఆనాటి హదీసు విద్యా పారంగతులు ఇమామ్ దాఖలీ (ర) గారి పాఠశాలలో చేరారు.

ఒక రోజు ఇమామ్ దాఖలీ (ర) ఒక హదీసు ప్రమాణాన్ని పేర్కొంటూ "సుఫ్యాన్ అన్ అబీ జుబైర్ అన్ ఇబ్రాహీం" అని అన్నారు. అప్పుడు ఇమాం బుఖారీ(ర) కల్పించుకుని "ఈ హదీసు ప్రమాణం ఈ విధంగా లేదండీ! అబూ జుబైర్ ఈ హదీసుని ఇబ్రాహీం నుండి ఉల్లేఖించలేదు" అని అన్నారు.

అతి పిన్న వయస్సులో ఉన్న ఒక శిష్యుడు తనను ఇలా తప్పు బట్టడంతో గురువు గారు ఉలిక్కి పడ్డారు. ఆయన కోపంతో కొర కొర చూశారు. ఇమామ్ బుఖారీ(ర) గురువు గారి పట్ల ఎంతో వినయ విధేయతలతో వ్యవహరిస్తూ – **'మీ దగ్గర అసలు గ్రంథం ఉంటే అందులో ఓ సారి చూసుకోండి'** అని ప్రశాంతంగా అన్నారు. ఇమామ్ దాఖలీ (ర) ఇంటికి వెళ్ళి అసలు గ్రంథాన్ని పరిశీలించి ఇమామ్ బుఖారీ(ర) చేసిన విమర్శ సహేతుకమయినదేనని గ్రహించారు. ఆయన తిరిగి వచ్చి **"అయితే సరయిన ప్రమాణం ఏమంటావు?"** అని అడిగారు. ఇమామ్ బుఖారీ (ర) తక్షణమే సమాధానమిస్తూ 'సుఫ్యాన్ అనిజ్జుబైరి వహువ వబ్‌ను అదియ్యి అన్ ఇబ్రాహీం (ఇబ్రాహీం నుండి జుబైర్ బిన్ అదీ రహ్మలై– ఉల్లేఖించారు; అబూజుబైర్ అనడం సరికాదు)' అని అన్నారు.

అప్పటికి ఇమామ్ బుఖారీ వయస్సు పద కొండేండ్లు కూడా నిండలేదు. పదహారు సంవత్సరాల వయస్సులో ఆయన హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ముబారక్(ర), ఇమామ్ వకీ(ర)లు సేకరించిన హదీసులన్నీ కంఠస్తం చేశారు. 18వ యేట చరిత్ర గ్రంథాన్ని రచించనారంభించారు. ఇందులో సహాబీలు (ప్రవక్త ప్రత్యక్ష అనుచరులు), తాబయీల (ఆ తరువాతి అనుచరుల) జీవిత చరిత్ర, వారు చెప్పిన మాటలు, చేసిన నిర్ణయాలన్నీ సమీకరించబడ్డాయి. ఈ గ్రంథాన్ని ఆయన దైవప్రవక్త (స) సమాధి దగ్గర కూర్చొని వెన్నెల రాత్రులలో రాశారు.

ఇమామ్ బుఖారీ (ర) అసామాన్య జ్ఞాపకశక్తి గల మేధా సంపన్నులు. ఎంత పెద్ద హదీసయినాసరే ఒక్కసారి చదివితే లేక వింటే చాలు కంఠస్తమయిపోయేది.

ఇమాం బుఖారీ (ర) గారి సమకాలిక హదీసువేత్త హామిద్ బిన్ ఇస్మాయీల్ ఇలా తెలియజేస్తున్నారు: "ఇమామ్ బుఖారీ బస్రాలో మాతో పాటు హదీసు తరగతులకు హాజరవుతూ ఉండేవారు. అయితే ఆయన కేవలం వినేవారు. ఒక్క అక్షరం కూడా వ్రాసుకునేవారు కాదు. ఈ విధంగా 16 రోజులు గడచిపోయాయి. చివరికి ఓ రోజు నేను, హదీసులు వ్రాసుకోకపోవడం పట్ల ఆయన్ని విమర్శించాను. దానికాయన సమాధానమిస్తూ "ఈ పదహారు రోజుల కాలంలో నీవు వ్రాసుకున్న విషయాలన్నీ తీసుకురా. వాటన్నిటినీ నేను చూడకుండా చదువుతాను విను" అని అన్నారు. ఆ విధంగా ఆయన పదిహేను వందలకు పైగా హదీసుల్ని ఒక్క పొల్లు పోకుండా ఉన్నది ఉన్నట్లు మాకు వినిపించారు. స్వయంగా మేము అనేక చోట్ల మా రాతల్లో దొర్లిన తప్పులను ఆయన నోట విని సవరించుకోవలసి వచ్చింది.

ఇమామ్ బుఖారీ (ర) గారి జ్ఞాపకశక్తి గాధలు దశ దిశలా వ్యాపించిపోయాయి. ఆయన ఏ ప్రాంతానికి బయలుదేరినా, ఆయనకు ముందే ఆ ప్రాంతానికి ఆయన పేరు ప్రఖ్యాతలు చేరుకునేవి. ప్రజలు వివిధ రకాలుగా ఆయన జ్ఞాపకశక్తి పరీక్షించేవారు. చివరికి వారు ఆయన అసాధారణ జ్ఞాపక శక్తికి ఆశ్చర్యచకితులయి ఎంతో అభినందించేవారు. ఆ కాలంలోనే షేఖ్ అబూ జరా (ర) అబూహాతిం (ర) ముహమ్మద్ బిన్ నస్ర్ (ర), ఇబ్ను ఖుజైమా (ర), ఇమామ్ తిర్మిజి(ర), ఇమామ్ ముస్లిం (ర)లు ఆయనకు శిష్యులయిపోయారు.

ఇమాం బుఖారీ(ర) ని ప్రశంసిస్తూ కొందరు ప్రముఖులు వెలిబుచ్చిన అభిప్రాయాలు వినండి: **'బుఖారీ (ర) హదీసు విద్యలో నా కంటే ఎక్కువ వివేకం, దూరదృష్టి గల వ్యక్తి. ఆయన దైవదాసుల్లోకెల్లా ఎక్కువ వివేచనాపరుడు. నిజం చెప్పాలంటే బుఖారీని మించిన వారు లేరు.'**

(ఇమామ్ దారమి (ర))

'ఖురాసాన్ భూభాగంలో ఇమామ్ బుఖారీ (ర) లాంటి మహోన్నత వ్యక్తి మరొకరు జన్మించ లేదు.' (ఇమామ్ అహ్మద్(ర))

'స్వయంగా ఇమామ్ బుఖారీ(ర) కూడా తన లాంటి వ్యక్తిని చూడలేదు.'

(ఇబ్నుల్ మదీనీ(ర))

telgo fbrvry.indd 8 2/12/12 4:08 PM

ఇమామ్ ముస్లిం బిన్ అల్ హిజాజ్(ర) ఓ సారి ఇమామ్ బుఖారీ (ర) సన్నిధికి వెళ్ళి ఆయన రెండు కళ్ళ మధ్య (నుదుటిని) ముద్దాడుతుండగా నేను కాళ్ళారా చూశాను. ఆ తరువాత ఆయన 'గురువులకు గురువూ! హదీసువేత్తల నాయకా! మీ పాదాలు చుంబించడానికి నాకు అనుమతి ఇవ్వండి' అని అన్నారు.' (అహమ్మద్ బిన్ హమ్దాన్(ర))

'ఆకాశం క్రింద ఈ ధరిత్రిపై ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ బుఖారీ (ర)ని మించిన హదీసు పండితుడు, పొరంగతుడు మరొకరు లేరు.' (ఇబ్ను ఖుజైమా(ర))

ఇమామ్ జీవిత విశేషాల్లో ముఖ్యంగా చెప్పుకోదగిన ఒక విశేషం ఉంది. ఆయన తన జీవితంలో ఏనాడూ ఎవరినీ నిందించలేదు, దోషించ లేదు, బాధించనూ లేదు. ఆయన స్వయంగా ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ **"పరలోక విచారణ దినాన పరోక్షనిందను గురించి నన్ను ప్రశ్నించడం జరగదని నేను ఆశిస్తున్నాను"** అని అప్పుడప్పుడు అంటుండేవారు.

ఇమామ్ బుఖారీ (ర) ఎంతో ఆత్మాభిమానం గల వ్యక్తి. దీన్ని గురించి ఉమర్ బిన్ హఫ్స్(ర) ఇలా తెలియజేస్తున్నారు: "బస్రాలోని హదీసు పాఠశాలలో నేను, ఇమామ్ బుఖారీ సహ విద్యార్థులుగా ఉండేవాళ్ళం. ఒక రోజు ఇమామ్ పాఠశాలకు రాలేదు. విచారిస్తే ఆ రోజు ఇమామ్ బుఖారీ దగ్గర ధరించి బయటికి రావడానికి సరిపడ్డ బట్టలు కూడా లేవని తెలిసింది. ఈ విషయం ఇతరుల ముందు బహిర్గతం కావడం ఆయనకు ఏ మాత్రం ఇష్టంలేదు. అందువల్ల ఆయన ఆ రోజు ఇంటి నుంచి బయటికే రాలేదు. ఆ తరువాత మేము ఆయన కోసం బట్టలు సంపాదించి తీసికెళ్ళి ఇచ్చాము. దాంతో ఆయన మరునాటి నుంచి పాఠశాలకు రావడం ప్రారంభించారు.

ఇమామ్ బుఖారీ(ర) రాజులకు, పాలకులకు ఎల్లప్పుడూ దూరంగా ఉండేవారు. అయితే ఓ రోజు బుఖారా గవర్నర్, తన దర్బారుకు వచ్చి తనకు హదీసులు వినిపించవలసిందిగా ఇమామ్ బుఖారీ(ర)కి విజ్ఞప్తి చేశాడు. దాంతో పాటు, ఇతరులెవరూ పాల్గొనకుండా ఉండే ఓ ప్రత్యేక సమావేశంలో తన పిల్లలకు హదీసు విద్య నేర్పవలసిందిగా కూడా అతను ఇమామ్ ని కోరాడు. ఇమామ్ ఈ రెండు కోర్కెలను తిరస్కరిస్తూ **"విద్యను గురువు దగ్గరకెళ్ళి నేర్చుకోవలసి ఉంటుంది. నా సమావేశంలో ధనికుడు – పేద అనే తారతమ్యం లేదు. ఇక్కడి కొచ్చి హదీసు విద్య నేర్చుకోవడానికి ప్రతి ఒక్కరికీ హక్కుంది"** అని సమాధానమిచ్చారు.

ఈ సమాధానం విని బుఖారా గవర్నర్ ఆగ్రహోదగ్రుడయ్యాడు. ఆ తరువాత వారిద్దరి మధ్య దూరం మరింత పెరిగిపోయింది. గవర్నర్ ఇమామ్ బుఖారీ(ర) మీద పగబూని బుసలు కొట్టడం ప్రారంభించాడు. దాంతో ఇమామ్ బుఖారీ(ర) బుఖారా పట్నం వదలి ఖర్తుంగ్ అనే ప్రాంతానికి వెళ్ళి తల దాచుకోవలసి వచ్చింది. అక్కడకు వెళ్ళిన తరువాత ఆయన వ్యాధిగ్రస్తులయ్యారు. చివరికి హిజ్రీ శకం 256లో ఈదుల్‌ఫిత్ర్ నాడు 62 సంవత్సరాల వయస్సులో ఆయన తనువు చాలించారు. – రహ్మతుల్లాహి అలై. అల్లాహ్ కృపానుగ్రహాలు ఆయన పై కురుయు గాక!

('మహా ప్రవక్త మహితోక్తుల' అన్న పుస్తకం నుండి)

ముస్లిం జీవితానికి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు

ప్ర: అల్లాహ్ తన అంతిమ ప్రవక్త(స)కు ప్రసాదించిన ఔన్నత్యాన్ని కొనియాడటంలో మనం హద్దు మీరి పోవటం సమంజసమేనా?

జ: మహనీయ ముహమ్మద్(స) సృష్టిశ్రేష్ఠులు, మానవోత్తములు. మానవ మహోపకారి. ఇందులో సందేహానికి ఆస్కారమే లేదు. అయితే ఆయన్ని(స) ప్రస్తుతిస్తున్నప్పుడు మనం అతిశయిల్లటం మాత్రం సమంజసం కాదు. క్రైస్తవులు మర్యం కుమారుడగు ఈసా (యేసు-అ) విషయంలో మితిమీరి పోయినట్లుగా మనం మితిమీరి పోవటం ధర్మసమ్మతం కాదు. ఎందుకంటే ఇలాంటి **'అతి'** నుండి మహా ప్రవక్త (స) మనల్ని వారించారు. ఆయన (స) ఇలా అన్నారు:

"నన్ను పొగడటంలో అతిశయిల్లకండి (హద్దుమీరకండి) క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసాను పొగుడుతూ మితిమీరి పోయినట్లుగా మీరు మాత్రం చేయరాదు సుమా! నేను అల్లాహ్ దాసుడను. కాబట్టి మీరు నన్ను అల్లాహ్ దాసుడు(అబ్దుల్లాహ్) దైవప్రవక్త(రసూల్) అని అనండి." (బుఖారీ)

ప్ర: భయం (ఖౌఫ్) ఎన్ని రకాలు ?

జ: 1) **తప్పనిసరి భయం:-** ఇది అల్లాహ్‌కు భయపడాల్సినది. ఎందుకంటే విశ్వాసానికి(ఈమాన్‌కు) మూల సూత్రాలు రెండు. **ఒకటి:** పరిపూర్ణమైనప్రేమ. **రెండవది:** పరిపూర్ణమైన భయ భక్తులు.

2) **భాగస్వామ్య భయం:-** అంటే ముష్రిక్కుల మిథ్యాదేవుళ్ళకు ఊరకే భయపడిపోవటం, వారు తమకు ఎక్కడ కీడు తలపెడతా రోనని ఆందోళన చెందటం.

3) **అధర్మమైన భయం:-** అంటే జనులకు భయపడి విధిగా చేయవలసిన పనులను వదలి పెట్టడం లేదా అధర్మమైన పనులు చేయటం.

4) **ధర్మసమ్మతమైన భయం:-** స్వాభావికంగా ఏదైనా క్రూర మృగాల్ని భయంకరమైన జంతువును చూసి భయపడటం.

ప్ర: తవక్కుల్ (భరోసా,భారం, నమ్మకం) ఎన్ని రకాలు?

జ: తవక్కుల్ మూడు రకాలు.

1) **వాజిబ్:** అన్ని విషయాలలోనూ – అంటే ప్రయోజనకరమైన వాటిని పొందాలనుకున్నా, నష్టకరమైన వాటిని దూరం చేయాల నుకున్నా అల్లాహ్ పైనే భరోసా చేయాలి. ఆయన్నే నమ్ముకోవాలి.

2) **హరామ్:** ఇది రెండు రకాలు: **మొదటిది:** షిర్కె అక్బర్- అంటే వస్తు కారకాలను పూర్తిగా నమ్ముకుని లాభం కలిగినా, నష్టం వాటిల్లినా వీటి వల్లనే సాధ్యం అని భావించటం. **రెండవది:** షిర్కె అస్గర్ – ఉపాధి విషయంలో ఎవరయినా ఒక వ్యక్తిని పూర్తిగా నమ్ముకోవటం. ముంచినా తేల్చినా ఇక అతనే అని మనసులో పెట్టుకుని అదేపనిగా ఆలోచిస్తూ ఉండటం.

3) **ధర్మసమ్మతం:** ఒక వ్యక్తి మరో వ్యక్తిని ఏదేని కార్యంపై తన ప్రతినిధిగా నియమించటం, ఆ వ్యవహారాన్ని అతను చక్కబెడతాడని నమ్మటం, క్రియవిక్రయాలలో సంబంధించి వేరొక వ్యక్తిపై భరోసా చేయటం.

telgo fbrvry.indd 9 2/12/12 4:08 PM

మూలం: డా. జాకిర్ నాయక్

ప్రశ్న: ముస్లింలకు ఒకరికంటే ఎక్కువ మంది భార్యలు కలిగి వుండే అనుమతి ఎందుకు? అంటే ఇస్లాం ఒకరికంటే అధిక మందిని వివాహమాడే అనుమతి ఎలా ఇచ్చింది?

జవాబు: 1) **బహు వివాహాల పారిభాషిక అర్థం:** దీని అర్థం ఏమిటంటే ఒక వ్యక్తి ఒకరికంటే ఎక్కువ మంది భార్యలు కలిగివుండే, లేక ఒక స్త్రీ ఒకరి కంటే ఎక్కువ మంది భర్తలు కలిగివుండే వ్యవస్థ. ఇది రెండు రకాలుగా ఉంటుంది :

1. ఒక పురుషుడు ఒకరికంటే ఎక్కువ భార్యలు కలిగి ఉండటం. (పోలిగామి)

2. ఒక స్త్రీ ఒకరికంటే ఎక్కువ మంది భర్తలు కలిగి ఉండటం. (పోల్యాండ్రీ)

కేవలం ఒకే స్త్రీని వివాహమాడండని ఆదేశించే, ఏ ఇతర ధార్మిక గ్రంథం ప్రపంచంలో లేదు. ఏ ధార్మిక గ్రంథంలోనైనా సరే, భార్యల సంఖ్యను పరిమితం చేసే ఆదేశం మనకు కనిపించదు. అది రామాయణం కానివ్వండి, మహాభారతం, గీతలు కాని వ్వండి, లేదా తల్‌మూద్ లేక బైబిల్ కాని వ్వండి. ఈ గ్రంథాల ననుసరించి ఒక వ్యక్తి తనకిష్టమైనంత మంది భార్యల్ని కలిగి వుండొచ్చు. తరువాత కాలంలో భార్యల సంఖ్య విషయంలో బైబిల్ ఎలాంటి పరిమితి విధించలేదు. కేవలం కొన్ని శతాబ్దాల క్రితమే, చర్చీ, పత్నుల సంఖ్యను పరిమితం చేస్తూ, ఒకరుగా నిర్ణయించింది.

యూదు మతంలో బహుభార్యాత్వానికి అనుమతి ఉంది. తల్‌మూద్ చట్టాన్ని అనుసరించి అబ్రహాం(అ)కు ముగ్గురు భార్యలున్నారు, మరియు సులైమాన్(అ)కు వంద లాది భార్యలుండేవారు. యూదుల్లో బహు భార్యత్వపు ఈ ఆచారం కొనసాగుతూనే ఉండేది. చివరికి యూదుల మతగురువు అయిన గర్షోమ్ బిన్ యహూదా వరకు కొనసాగుతూనే ఉండేది. చివరికి ఇస్రాయీల్ చీఫ్ రబ్బి, ఒకరికంటే ఎక్కువ మంది భార్యలు కలిగి ఉండటంపై నిషేధం విధించాడు.



ఒక పురుషుడు, ఒక నియమిత పరిమితి లో ఒకరికంటే ఎక్కువ మంది భార్యలు కలిగి వుండే అనుమతి ఇస్లాంలో ఉంది. కాని ఒకరికంటే ఎక్కువ మంది భర్తలు కలిగివుండే అధికారం స్త్రీకి లేదు.

ఇక ఇప్పుడు పురుషునికి ఒకరికంటే ఎక్కువ మంది భార్యలు కలిగివుండే అనుమతి ఇస్లాం ఎందుకిచ్చిందనే అంశాన్ని పరిశీలిద్దాం.

"కేవలం ఒకే స్త్రీని వివాహమాడండి" అని ఆదేశించే ధార్మిక గ్రంథం, ప్రపంచంలో కెల్లా ఒక్క ఖుర్‌ఆన్ మాత్రమే.

హిందూ సాధువులు మరియు క్రైస్తవ పాదరీలు, వీరి సంఖ్యను కుదించి కేవలం ఒకటని నిర్ణయించారు.

వారి ధార్మిక పుస్తకాల్లో పేర్కొన్నట్లు, ఎంతో మంది హిందూ ధార్మిక వ్యక్తిత్వాలు, అనేకమంది భార్యల్ని కలిగి ఉండటం మనం కనుగొంటాము. శ్రీ రామచంద్రుని తండ్రిగారైన దశరథ మహారాజు, ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలు కలిగి వున్నారు. అదేవిధంగా శ్రీకృష్ణునికి కూడా ఎంతోమంది భార్యలుండేవారు. ప్రాచీన కాలంలో క్రైస్తవులకు, వారికిష్టమైనంత మంది భార్యల్ని ఉంచుకునే స్వాతంత్ర్యముండేది. దీనికి కారణం ఏమిటంటే–

2 - విచిత్రం, కాని నిజం

ముస్లింలకన్నా, హిందువుల్లోనే బహు భార్యాత్వం ఎక్కువ. భారతదేశంలో క్రీ.శ. 1975లో జరిగిన సెన్సస్(జనాభా గణనం)లో ఒక విచిత్ర విషయం బయట పడింది. 1975లో **"కమిటీ ఆఫ్ ది స్టేట్ వుమెన్ ఇన్ ఇస్లాం"** ద్వారా జారీచేయబడిన రిపోర్టులోని పేజి 66 మరియు 67ను అనుసరించి, 1951 మరియు 1961 మధ్య కాలంలో, ఒకరికంటే ఎక్కువ మంది భార్యలు కలిగిన హిందువులు 5.06 శాతముంటే, ముస్లింలలో ఈ సంఖ్య 4.31 శాతముంది. భారతీయ చట్టాన్ని అనుసరించి, ఒకరికంటే ఎక్కువ

telgo fbrvry.indd 10 2/12/12 4:08 PM

మంది భార్యలు కలిగి ఉండటం కేవలం ముస్లింలకు మాత్రమే అనుమతి ఉంది. ముస్లిమేతరులు, ఒకరికంటే అధిక మంది భార్యలు కలిగి ఉండటం చట్ట వ్యతిరేకం. అయినా కూడా, ముస్లింలకన్నా హిందువుల్లోనే, ఒకరికంటే ఎక్కువ మంది భార్యలు కలిగిన వారి సంఖ్య అధికంగా ఉంది. అంతకు ముందు హిందువుల్లో, ఒకరి కంటే ఎక్కువమంది భార్యలు ఉండటంపై ఏలాంటి ఆంక్ష లేకుండేది. 1956లో **"హిందూ మేరేజ్ ఆక్టు"** అమలులోకి వచ్చింది. తద్వారా ఒకరికంటే ఎక్కువ మందిని వివాహమాడటంపై ఆంక్ష విధి స్తూ బహుభార్యాత్వాన్ని చట్ట వ్యతిరేకంగా ప్రకటించటం జరిగింది. హిందువులపై బహుభార్యాత్వాన్ని నిషేధించింది భార తీయ చట్టాలే కాని హిందూ ధార్మిక గ్రం థాలు మాత్రం కాదు. ఇక ఇప్పుడు ఇస్లాం, పురుషునికి బహు వివాహాలు చేసుకునే అనుమతి ఎందుకిచ్చిందనే విష యాన్ని చర్చిద్దాం.

3. దివ్య ఖుర్ఆన్ బహుభార్యాత్వాన్ని నియంత్రిస్తుంది.

'ఒకరిని వివాహమాడండ'ని చెప్పే ఏకైక ధార్మిక గ్రంథం ఖుర్ఆన్ అనే విషయాన్ని నేనింతకు ముందే చెప్పి వున్నాను. ఈ విషయాన్ని తెలియపరచే దివ్యఖుర్ఆన్ ఆయత్ ఈ విధంగా ఉంది:

"అనాథలకు న్యాయం చేయలేమనే భయం మీకు కలిగితే, మీకు నచ్చిన స్త్రీల ను ఇద్దరేసి గాని, ముగ్గురేసిగాని, నలుగు రేసిగాని వివాహం చేసుకోండి, అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే భయం మీకుంటే, అప్పుడు ఒకామెనే చేసుకోండి. లేదా మీ స్వాధీనంలోకి వచ్చి న స్త్రీలను దాంపత్యంలోకి తీసుకోండి. ...." (నిసా:3)

ఖుర్ఆన్ అవతరించక ముందు, భార్యల సంఖ్యపై ఎలాంటి పరిమితిగాని, ఆంక్ష గాని లేదు. అందుకని అరబ్బులు ఏక సమయంలో అనేకమంది భార్యలు కలిగి ఉండేవారు. ఈ సంఖ్య కొన్ని సందర్భాల్లో వందల వరకు చేరేది. అయితే ఇస్లాం అవతరించిన తరువాత, ఈ సంఖ్యను నాలుగు వరకు కుదించింది. ఇస్లాం, ఒక పురుషునికి ఇద్దరు, లేక ముగ్గురు లేక నలుగురు భార్యల వరకు వివాహం చేసు కునే అనుమతినిస్తుంది, కాని దీనితో పాటే అనివార్యంగా వారందరి మధ్య న్యాయం పాటించే షరతును కూడా విధించింది.

ఖుర్ఆన్‌లోని ఇదే అధ్యాయంలో అనగా సూర నిసాలోని 129వ ఆయత్‌లో ఇలా చెప్పటం జరిగింది: **"భార్యల మధ్య పూర్తి న్యాయం చెయ్యటం మీ శక్తికి మించిన పని."** (నిసా:129)

అందుకని ఖుర్ఆన్ ద్వారా తెలిసేదేమి టంటే, బహుభార్యాత్వం అనేది ఒక ఆదే శం, ఆజ్ఞ ఎంతమాత్రం కాదు, ఇదొక అనుమతి, సడలింపు మాత్రమే. ముస్లింల కు ఒకరికంటే ఎక్కువ మంది భార్యలుండ టం అనివార్యమని చాలమంది అపోహకు గురి అయివున్నారు. కాని అది వాస్తవం ఎంత మాత్రం కాదు.

సామాన్యంగా ఒక పని గురించి చేయ టమా? మానుకోవటమా? అనే విషయం గురించి ఇస్లాం ఆదేశాలు ఐదు రకాలుగా విభజించబడి వున్నాయి.

1) ఫ్రర్జ్–అంటే అనివార్యమైనది. తప్ప కుండా చేయాలి.
2) ముస్తహబ్–అంటే అభిలషించదగినది, చేయమని ప్రోత్సహించదగినది.
3) ముబాహ్ – అంటే అది చేసే అనుమతి ఉంది.
4. మక్రూహ్ – అంటే అవాంఛనీయం, మంచిదని ప్రోత్సహించతగినది.
5) హరాం– అంటే నిషేధితమైనది. ఎట్టి పరిస్థితుల్లోను చేయరాదు.

బహుభార్యాత్వం అనేది ఈ ఐదింటిలో మధ్య రకం అనగా **'ముబాహ్'** కోవకు చెందినది. అంటే దీన్ని చేయటానికి అను మతి మాత్రమే ఉంది. ఆజ్ఞ, ఆదేశం కాదు. దీని అర్థం ఏమిటంటే, ఇద్దరు, ముగ్గురు, నలుగురు భార్యలు కలిగిన ఒక ముస్లిం, ఒకే పత్ని ఉన్న ముస్లిం కన్నా ఉన్నతుడు, మేలైనవాడు అని కాదు. అంటే ఇది పుణ్యమూ కాదు, పాపమూ కాదు.

> **వ్యాధుల్ని ఎదుర్కోవటంలో బాలురకన్నా, బాలికలు అధిక శక్తిసామర్థ్యాలు కలిగి ఉంటారు. ఈ కారణంగానే శిశు దశలో, పాపలకన్నా బాబుల సంఖ్య మరణాల్లో అధికంగా ఉంటుంది. ఇక యుద్ధాలు సంభవించినప్పుడు కూడా, స్త్రీలకన్నా పురుషులే అధిక సంఖ్యలో మరణిస్తుంటారు. క్లుప్తంగా చెప్పాలంటే స్త్రీ సరాసరి వయస్సు పురుషులకన్నా అధికంగానే ఉంటుంది. ఈ కారణంగా ప్రపంచంలో విధవల సంఖ్య భార్యావిహీనుల సంఖ్యకన్నా ఎప్పుడూ అధికంగానే ఉంటుంది.**

4. స్త్రీల సరాసరి వయస్సు, పురు షుల కంటే అధికంగా ఉంటుంది.

ప్రకృతి సహజంగా స్త్రీ పురుషులు దాదాపు ఒకే నిష్పత్తిలో జన్మిస్తారు. (జన్మించినప్పటి నుండే) బాబులకన్నా, పాపల్లో వ్యాధి నిరోధక శక్తి (ఇమ్యునిటి) అధికంగా ఉంటుంది. దీని అర్థం ఏమి టంటే, క్రిములన్ని, వ్యాధుల్ని ఎదుర్కోవ టంలో బాలురకన్నా, బాలికలు అధిక శక్తిసామర్థ్యాలు కలిగి ఉంటారు. ఈ కార ణంగానే శిశు దశలో, పాపలకన్నా బాబుల సంఖ్య మరణాల్లో అధికంగా ఉం టుంది. ఇక యుద్ధాలు సంభవించినప్పు డు కూడా, స్త్రీలకన్నా పురుషులే అధిక సంఖ్యలో మరణిస్తుంటారు. క్లుప్తంగా చెప్పాలంటే స్త్రీ సరాసరి వయస్సు పురు షులకన్నా అధికంగానే ఉంటుంది. ఈ కారణంగా ప్రపంచంలో విధవల సంఖ్య భార్యావిహీనుల సంఖ్యకన్నా ఎప్పుడూ అధికంగానే ఉంటుంది. అదీగాక ప్రపం చంలో ఎప్పుడు లెక్కించినా గాని, స్త్రీల సంఖ్య పురుషులకన్నా అధికంగానే ఉండటం మీరు గమనిస్తారు. ఉదాహ రణకు –

(ఇంకా ఉంది)

telgo fbrvry.indd 11 2/12/12 4:08 PM

పూ పరిమళం
షేక్ హబీబుర్రహ్మాన్ జామయీ

దానం లాభాలు దశకం

1) దానం వల్ల దైవదూతల దీవెనలు లభిస్తాయి.
ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: దానం చేసేవారి కోసం దైవ దూతలు **"ఇచ్చేవానికి మరింత ప్రసాదించు"** అని దుఆ చేస్తారు.

2) దానం వలన షైతానుకు విరుద్ధంగా అల్లాహ్ సహాయం ఉంటుంది.
దైవప్రవక్త (స) సెలవిచ్చారు: దానం చేసేవాడు దానం వల్ల అతను షైతాన్ ప్రభావం నుండి కాపాడపడతాడు.

3) దానం వలన స్వస్థత కలుగుతుంది.
దైవప్రవక్త (స) సెలవిచ్చారు: **"దానం ద్వారా మీ రోగులకు స్వస్థత చేకూర్చండి"**

4) దానం అల్లాహ్ ఆగ్రహాన్ని చల్లార్చుతుంది.
దైవప్రవక్త (స) సెలవిచ్చారు: **"దానం అల్లాహ్ ఆగ్రహాన్ని చల్లార్చుతుంది."**

5) దానం వలన పాపాలు మన్నించబడాయి.
దైవప్రవక్త (స) సెలవిచ్చారు: **"ఏ విధంగానయితే నీరు నిప్పుని ఆర్పుతుందో అదే విధంగా సదఖా పాపాల్ని కడిగివేస్తుంది."**


6) సదఖా కీర్త ప్రతిష్టను పెంచుతుంది.
దైవప్రవక్త (స) సెలవిచ్చారు: **"మీ సంపదను (మంచి మార్గంలో) ఖర్చు చేసి మీ పరువును కాపాడుకోండి".**

7) దానం వల్ల మనిషి ముగింపు సుఖాంతం అవుతుంది.
దైవప్రవక్త (స) సెలవిచ్చారు: **"నిశ్చయంగా దానం అల్లాహ్ ఆగ్రహం నుండి మరియు చెడు చావు నుంచి మనిషిని కాపాడుతుంది."**

8) దానం ప్రళయ దినాన నీడనిస్తుంది.
దైవప్రవక్త (స) సెలవిచ్చారు: **"ప్రతి వ్యక్తీ (తీర్పు దినాన) తన దానాల నీడలో నిలబడి ఉంటాడు. కడకు ప్రజల మధ్య తీర్పు జరిగి పోతుంది".**

9) దానం ప్రళయ దినాన రుణభారాన్ని తొలగిస్తుంది.
దైవప్రవక్త (స) సెలవిచ్చారు: **"ఎవరైతే అప్పు వదలి మరణించిన వారి రుణాన్ని తీరుస్తాడో ప్రళయ దినాన అల్లాహ్ అతని రుణభారాన్ని తొలగిస్తాడు."**

10) సదఖా నరకం నుంచి కాపాడుతుంది.
దైవప్రవక్త (స) సెలవిచ్చారు: **"ఓ ఆయిషా! ఒక ఖర్జూరపు తునకను దానం చేసైనా సరే నిన్ను నీవు నరకం నుండి కాపాడుకో".**



దైవ ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: అప్పు రెండు రకాలు. ఒకటి – అప్పు తీసుకున్న వ్యక్తి మరణించాడు. అయితే అప్పు తీర్చాలన్న దృఢ సంకల్పం అతనికి ఉండేది. అలాంటి వ్యక్తి యొక్క జమానతును నేను స్వీకరిస్తున్నాను. రెండవది – అప్పు తీసుకున్న వ్యక్తి మరణించాడు. కానీ అప్పు తీర్చాలన్న ఉద్దేశ్యం ఏకాస్తయినా అతనికి ఉండేది కాదు. అలాంటి వ్యక్తి పుణ్యాల్లోంచి తీసుకొని మరి ప్రళయ దినాన అప్పు తీర్చబడుతుంది.

- అప్పు అప్రతిష్ట పాలు చేస్తుంది.
- అప్పు రాత్రికి కలత రూపం మరియు పగలు అవమాన రూపం ధరించి వస్తోంది. అప్పు మనిషి యొక్క పరువు ప్రతిష్టల్ని బూడిద పాలు చేస్తుంది.
- అల్లాహ్ రుణభారంతో తలమునకలై ఉన్న వ్యక్తి అప్పు తీరేంత వరకు తోడుంటాడు. అయితే అప్పుగా తీసుకున్న సొమ్ముతో హరామ్ పనులు చేసి ఉండకూడదు.
- అప్పు తీరనంత వరకూ తీసుకున్న వ్యక్తిపై అది పెత్తనం చెలాయి స్తుంది.
- తీర్చే ఉద్దేశ్యం లేకుండా (ఎగ్గొట్టాలన్న ఉద్దేశ్యంతో) అప్పు తీసకునే వ్యక్తి, అల్లాహ్‌తో ఓ దొంగలా కలుస్తాడు.
- ఎంత అప్పు తక్కువ ఉంటే అంత జీవితం ప్రశాంతంగా ఉంటుంది.
- అప్పు ఆనందంతో మొదలై, బాధతో ముగుస్తుంది.
- ఘోర పాపాల తరువాత అన్నింటికంటే ఘోరపాపం– మనిషి మరణించినా అతనిపై అప్పు ఉండటం. వారసులు ఆ అప్పు తీర్చే ప్రయత్నం చేయకపోవడం.
- ఓ వ్యక్తి స్వర్గంలో ప్రవేశించాడు. అక్కడ ఓ ముఖద్వారంపై **'దానధర్మానికి పదింతలు పుణ్యం. అప్పు ఇచ్చే వ్యక్తికి 18 రెట్లు పుణ్యం' అని** వ్రాసి ఉండటం చూశాడు'. (సహీహుత్తర్గీబ్ పేజీ 900)
- కారణం – దానం అవరార్థునికి మరియు ధనికునికి సయితం లభించే అవకాశం ఉంది. కానీ అప్పు అవసరార్థునికి మాత్రమే ఇవ్వబడతుంది గనక దాని పుణ్యం అధికం అని కొందరు పండితులు అభిప్రాయ పడ్డారు.

telgo fbrvry.indd 12 2/12/12 4:08 PM

అబుల్ హసన్

ఓ నియంత కావాలి!

మౌఢ్యాన్ని నిరసిస్తే
కుమిలిపోతావెందుకో చెప్పు?
సత్యం ఇదని చెబితే ఏమిటి తప్పు?

దైవగ్రంథాన్ని నీళ్లల్లో నానబెట్టమనడం
దైవ గ్రంథ అనువాదాన్ని చదవకూడదనడం
చదివినా ఆలోచించకూడదనడం
ఆలోచించినా తర్కించకూడదనడం
జీవితాన్ని చీకట్లలో మ్రగ్గనీయమనడం

ఇది కళ్ళున్న కబోదుల ఛాందస వాదం!
పూర్వం నుండి –

అడవుల్లో జంతువుల కోసం తవ్వి
ఆకులములతో కప్పేసిన గొయ్యిలా
అడుగడుగునా మూఢాచారాల పెను ఊబి
అట్టహాసంగా కరాళ నృత్యం చేస్తోంది

అమాయక ప్రజల రక్తం త్రాగే
రక్తంతో ఖుర్‌ఆన్ వాక్యాల్ని వ్రాసే అతివాదులకు
అర్థమవుతుందా ప్రవక్త (స) వారి సందేశం?
సహిస్తుందా శాంతి సంకేతం??

అందుకే–
విచ్చలవిడిగా దశ దిశలా ప్రబలుతున్న
దారుణ హింసా పోకడలను పైశావిక వికృత
వికటాట్టహాసాన్ని
మరింత వికటించకుండా, విస్తరించకుండా
అంతం చేయాలి.

నిజానికి శిష్ట రక్షణ కోసం దుష్ట శిక్షణ కోసం
ఓ నియంత కావాలి!
ఆ నిర్ణేత మీ నుండే రావాలి!!

ప్రవక్త (స) వారి ప్రవచనాలు


ప్రవక్త (స) ప్రవచనాలు పూర్ణ ప్రగతికి సోపానాలు
సమతకు, మమతకు ప్రతిరూపాలు
ప్రేమను పెంచే స్తుతి ఆలాపనలు
శాంతిని పంచే మలయ పవనాలు

ప్రవక్త వాక్కుల్లో అమృతం నిండి ఉన్నది
మనిషిలోని కల్మషాన్ని తుడవగలదది
కల్లాకపటం లేని హృదయం ప్రవక్తది
వెన్నెల్లాంటి మనసు ప్రవక్తది

ప్రవక్త అధరాలపై కదలాడు హదీసు వెలుగులు
ప్రజల పాలిట అవి ఆనందాల హరివిల్లు
ప్రవక్త వారి ప్రేమైక చూపులు అవి
మనో చీకటిని తొలగించే జ్యోతులు

ప్రవక్త పలుకులు తీయనైనవి
తేనెకన్నా మిన్నగా మధురమైనవి
ప్రవక్త చూపులు చల్లనైనవి – మరు
మల్లె వలె, నిండు జాబిల్లి వలె తెల్లనైనవి

ఈ ఆదర్శామృతాల్ని –
అమలు పర్చ గల వాళ్లెవరైనా
వజ్ర సంకల్పంతో ముందుకు రండి
అల్లాహ్ వారికి తోడుంటాడు
తన రంగులో వారిని రంగరిస్తాడు
ఊహకందని విధంగా ఉపాధినిస్తాడు
పరిపాలనాధికారాననుగ్రహిస్తాడు
స్వర్గసౌఖ్యాలు ప్రసాదిస్తాడు.



telgo fbrvry.indd 13 2/12/12 4:08 PM

మొక్కజొన్నతో చికెన్ సూప్



కావలసిన సామగ్రి:

కోడి ముందు భాగాలు (చికెన్ బ్రెస్ట్) + 5 గ్లాసుల నీరు + ఒక డబ్బా మొక్క జొన్న (క్రీమ్‌తో) + ఒక ప్యాకెట్టు క్రీమ్ చికెన్ + ఒక పెద్ద స్పూను కార్న్‌ఫ్లోర్ + ఒక గ్రుడ్డు

ఉడక పెట్టుటకు: ఒక చిన్న ఉల్లిగడ్డ + ఒక వెల్లుల్లిపాయ + నూరని మసాలాలు + ఉప్పు.

తయారు చేయు విధానము:

1. చికెన్ శుభ్ర పరచుకుని నీటిలో వేసి ఉడక పెట్టాలి, ఉడికే చికెన్‌లో మసాలాలు, ఉల్లిగడ్డలు, మరియు వెల్లుల్లిపాయ వేసి చక్కగా ఉడకనివ్వాలి. తరువాత దాన్ని ఒక శుభ్రమైన పాత్రలో వడపోసుకోవాలి. చికెన్‌ను చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవాలి. ఆ నీటిని అలాగే పొయ్యి మీద ఉంచాలి.

2. మరగే నీటిలో సూప్ ప్యాకెట్టు, క్రీమ్, నషా (ఈస్ట్) మరియు కార్న్‌ఫ్లోర్ వేసి కాస్త చల్లబడేంత వరకు ప్రక్కన పెట్టాలి, గరిటెతో సూపును చక్కగా అన్నీ ఏకమయ్యేట్లు కలియబెడ్తూ ఉండాలి. మరలా సూప్ పాత్రను పొయ్యి మీద పెట్టి అది చిక్కగా అయ్యేంత వరకు మరగనివ్వాలి.

3. సూప్‌లో క్రీము, మొక్కజొన్న, చికెన్ ముక్కలు వేసి 5 నిమిషముల వరకు ఉడకనివ్వాలి.

4. గ్రుడ్డును పగలగొట్టి ఒకేసారి సూపులో వేసి త్వరత్వరగా గుండ్రని రింగులు కలిగి దారాలుగా మారునట్లు కలపి సర్వ్ చేయండి.

మష్‌రూమ్, బంగాళా దుంపలు మరియు చీజ్ తో సూప్

కావలసిన సామగ్రి:

1- బంగాళా దుంపలు 3 మీడియం సైజు లేక 600 గ్రాములు
2- తాజా మష్‌రూమ్‌లు 15 నుండి 20
3- రెడీమేడ్ మష్‌రూమ్ సూప్ పొడరు పేకట్టు లేక 65 గ్రాములు
4- పసుపు పచ్చగట్టి చీజ్ (తురమ బడిన) 1/2 కప్పు
5- వెజిటబల్ ఆయిల్ 4 టేబల్ స్పూన్లు
6- తరిగిన లేక దంచిన వెల్లుల్లిపాయలు 1 టీ స్పూను
7- నల్ల మిర్యాల పొడి పైన చల్లుటకు లేక అభిరుచికి తగ్గట్టు
8- జీలకర్ర పొడి 1/4 టీ స్పూను
9- మ్యాగీ చికెన్ క్యూబు 1
10- ఉప్పు అభిరుచికి తగ్గట్టు
11- నీరు 12 గ్లాసులు

తయారు చేయు పద్ధతి:

- ఒక పాత్రలో నీరు పోసి పొయ్యి మీద మరగనివ్వాలి.
- తొక్క తీసిన బంగాళాదుంపలు మరిగే నీటిలో వేసి ఉడకనివ్వాలి, మెత్త పడిన తరువాత చల్లపడేందుకు ప్రక్కన పెట్టాలి.
- ఒక పాత్రలో మష్‌రూమ్ సూప్ పేకెట్టు మరియు ఉడికిన బంగాళాదుంపలు వేసి హేండ్ మిక్సర్‌తో నీరు, బంగాళాదుంపలు మరియు సూప్ ఏకమయ్యేటట్లు చక్కగా మిక్స్‌చేయాలి.
- మరొక పాత్రలో నూనె పోసి వెల్లుల్లి పాయలు కాస్త వేపాలి తరువాత మష్‌రూమ్ ముక్కలు వేసి పెద్ద మంటపై వేపాలి.
-వేగిన మష్రూమ్‌లో బంగాళాదుంపల మిశ్రమం (కాస్త వేడైన తరువాత) మేగి చికెన్ క్యూబ్ మరియు మసాలాలతో సహా వేయాలి.
- సూప్ అలాగే పొయ్యి మీద మీడియం మంటపై అరగంట వరకు ఉండనివ్వాలి.
- వేడి సూప్‌లో తురిమిన చీజ్ వేసి కాస్త కలిపి ఇక సర్వ్ చేయండి.

బంగాళాదుంపలతో క్యారట్ సూప్

కావలసిన సామగ్రి:

1- క్యారట్లు 1/2 (అర) కిలో
2- పెద్దబంగాళాదుంపలు1/4 (పావు)కిలో
3- పెద్ద ఉల్లిపాయలు 1
4- బట్టరు 1/2 టేబల్ స్పూన్లు
5- మేగి చికెన్ క్యూబ్ కలిపిన నీరు 5 గ్లాసులు
6- ఒక చిటికెడు చిదిమిన అజీనామోతు వూస్టర్ సోస్
7- టొమేటొ పేస్ట్ 1 టేబల్ స్పూన్
8- తరిగిన బఖ్‌దూనిస్ 2 టేబల్ స్పూనులు

తయారు చేయు పద్ధతి:

- తొక్క తీసి బంగాళాదుంపలను మరియు క్యారట్లను చక్కగా తరగాలి.
- శుభ్రమైన ఒక పాత్ర తీసుకొని, దానిని చిన్న జ్వాలపై స్టొ మీద పెట్టాలి పాత్రలోని నీరు ఆవిరైపోయిన తరువాత బట్టరు వేయాలి.
- తరిగిన క్యారట్లు మరియు బంగాళా దుంపలు బట్టరులో వేయాలి. తరువాత ఉల్లిపాయలను చక్కగా తరిగి అవి కూడా వేసి గరిటతో కలపాలి, తరువాత పాత్రను మూసి వేసి 10 నిముషముల వరకు అలాగే చిన్న మంట పై ఉడక నివ్వాలి.
- మేగీ సూప్ మరియు చిటికెడు అజీనా మోతు పొడరు క్యారట్ల మిక్స్‌చరులో కలిపి ఆ మొత్తాన్ని 20 నిమిషముల వరకు ఉడక నివ్వాలి.
- ఆ సూపులోని సగ భాగాన్ని మరొక పాత్రలో తీసి, ఆ మరిగే సూప్‌లో టొమాటో పేస్టు మరియు వూస్టర్ సోస్ వేయాలి. తరువాత మిగతా తీయబడిన సూప్‌ను మరలా దానిలో కలపాలి మీ అభిరుచికి తగ్గట్టుగా ఉప్పు మరియు మిర ప్పొడి కలుపుకోవాలి.
- తరిగిన బఖ్‌దూనిస్ సూప్‌పై వేసి అలంకరించి వేడి వేడిగా సర్వ్ చేయండి.

telgo fbrvry.indd 14 2/12/12 4:08 PM

ప్రవక్త ముహమ్మద్(స) ప్రవచించారు **"మీలో ప్రతి వ్యక్తీ బాధ్యతాయుతుడే. అతని ఆధీనములో ఉన్న ప్రతి ఒక్కరి విషయంలో ప్రశ్నింపబడతాడు. ప్రజలకు నాయకుడైన ఇమామ్ కాపలాదారు. అతని ఆధీనంలో ఉన్న ప్రజల విషయంలో అతన్ని ప్రశ్నించడం జరుగుతుంది. మనిషి తన ఇంటి వారికి కాపలాదారు. వారి విషయంలో అతడు సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. స్త్రీ తన భర్త ఇల్లు, అతని పిల్లలకు కాపలాదారు, వారిని గురించి ఆమెను ప్రశ్నించడం జరుగుతుంది. బానిస తన యజమాని వస్తుసామాగ్రికి కాపలాదారు. ఆమె లేక అతన్ని వాటి విషయంలో ప్రశ్నించడం జరుగుతుంది. కాబట్టి వినండి! మీలో ప్రతి ఒక్కరూ కాపలాదారే, ప్రతి వ్యక్తితో అతని బాధ్యత గురించి ప్రశ్నించడం జరుగుతుంది."**

సోదరీ! మీరు ఇప్పుడు ఒక కువైటీ ముస్లిం గృహంలో నివసిస్తున్నారు. వారి సాంప్రదాయాలు, వారి అలవాట్లు మీకు మొదట్లో అపరిచితంగా మరియు క్రొత్తగా అనిపించినా మీరు వారిని అర్థం చేసుకుని వారిలో ఇమిడి సంతోషంగా మరియు సంతృప్తిగా ఉండడానికి ప్రయత్నించాలి. ఈ సంచికలో మేము పైన ఇవ్వబడిన హదీసులో పేర్కొనబడిన చర్యలు వాటి ప్రాముఖ్యత విశ్వసనీయత, భద్రతా భావం మరియు మనము ఏది చేసినా ఎక్కడ ఉన్నా అల్లాహ్ మనల్ని చూస్తున్నాడు అన్న భావన మరియు ఏ వస్తువునైనా జాగ్రత్త పరచుటకు ఇచ్చినచో ఎలా మనం వాటికి కాపలాదారులమవుతామో ఉదాహరణల ద్వారా విశ్లేషించుటకు ప్రయత్నిస్తాము.

మీరు ఉండే ఇంటిని ఎలా కాపాడాలి?

ఇప్పుడు మీరు ఏ ఇంట్లోనైతే పని చేస్తున్నారో ఆ ఇంటిలో ఒక కుటుంబ సభ్యులు మీకు ఇవ్వబడిన ఈ జీవన సదుపాయాలకుగానూ మీరు ఎల్లప్పుడూ అల్లాహ్‌ను ప్రార్థిస్తూ మరియు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉండాలి. అదేకాక మీరు ఆలోచించాల్సిందేమనగా మీరు ఎక్కడున్నా ఏ పని చేస్తున్నా అల్లాహ్ మిమ్మల్ని చూస్తున్నాడు అని .

ఒకసారి జరిగిందేమిటంటే అబ్దుల్లాహ్ బిన్ దీనార్ (ర) ఇలా ఉల్లేఖించారు "ఉమర్ బిన్ ఖత్తాబ్ మరియు నేను ఇద్దరము మక్కావైపునకు ప్రయాణిస్తు న్నాము. దారిలో ఒక గుట్టపై నుండి గొర్రెల కాపరి గొర్రెల మందను తోలుకుంటూ వస్తున్నాడు అతన్ని చూచి ఉమర్(ర) ఇలా అన్నారు **"ఓ కాపరీ! ఈ మందలో నుండి ఒక మేకనమ్ము తావా?"** దానికి ఆ కాపరి, **"ఇవి నావి కావు, నా యజమాను రాలివి" అన్నాడు.**

"ఒక మేకను తోడేలెత్తుకుని పోయిందని నీ యజమానురాలికి చెప్పు" అని ఉమర్(ర) చెప్పగా **"నేను చెప్తే తను నమ్ముతుంది కాని అల్లాహ్ ఎక్కడ?"** (అర్థమేమిటంటే, నా యజమాని చూడక పోయినా ఆ నిజ యజమాని అయిన అల్లాహ్ చూస్తున్నాడు అతనికి ఇవ్వ వలసిన సమాధానమేమిటి) అని కాపరి చెప్పాడు.

ఇలా వినగానే ఉమర్(ర) ఏడవనారంభించారు. మరుసటి రోజు ఆయన వెళ్ళి గొర్రెల యజమాని వద్ద నుండి బానిసను కొనుగోలు చేసి అతనికి స్వేచ్ఛనిచ్చారు.

1) మీరు, మీ యజమానులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే అపరిచితులను యజమానుల అనుమతి లేనిదే లేక వారికి తెలియకుండా ఇంట్లోకి రానివ్వకూడదు.
2) మీ యజమానుల అనుమతి లేకుండా ఇష్టమొచ్చినట్లు వండి తినుభండారాలను పడేయడం గానీ ఇతరులకివ్వడం కానీ చేయకూడదు.
3) ప్రతి చిన్న పెద్ద వ్యక్తిగత విషయాల్లో తల దూర్చి కుతూహలాన్ని చూపడం ద్వారా మీకేమీ లాభం ఉండదు. కానీ మీ వ్యక్తిత్వమే అప్రియంగా మారిపోతుంది. కాబట్టి అనవసర విషయాలలో తల దూర్చకండి.

గృహ మర్యాదలు



telgo fbrvry.indd 15 2/12/12 4:08 PM

టి.ఎమ్.ఎ ఆధ్వర్యంలో 'మానవ జీవిత లక్ష్యం' అన్న అంశంపై బహిరంగ సమావేశం



తెలుగు ముస్లిం అసోసియేషన్ (టిఎమ్ఎ) ఆధ్వర్యంలో, ఐపిసి సహకారంతో 04- 02-2012 శనివారం కువైట్ సిటీలోని మస్జిద్ అల్ కబీర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 120 మంది హాజరయ్యారు. తెలుగు ప్రజల మధ్య ఆధ్యాత్మిక లక్ష్య అవగాహన కలిగించాలన్న సదుద్దేశ్యంతో **'మానవ జీవిత లక్ష్యం'** అన్న బ్యానర్ క్రింద జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. షేఖ్ రియాజ్ గారి ఖుర్‌ఆన్ పారాయణంతో ప్రారంభమయిన ఈ కార్యక్రంలో టిఐమ్ఎ మాజీ డైరక్టర్ ముహమ్మద్ హనీఫ్ కన్వీనర్‌గా వ్యవహరించగా, **నెలవంక** ఎడిటర్ సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ, శ్రీ సత్య సాయి సేవా సమితి మాజీ అధ్యక్షులు శ్రీ బి. పాండురంగారావు తర్వాత శ్రీ మన్నూరు సుధార్ గారు మానవ జీవిత లక్ష్యం అన్న అంశంపై మాట్లాడారు. చివర్లో కువైట్ ఔఖాఫ్ ఆహ్వానంపై భారత దేశం నుండి విచ్చేసిన ధర్మ ప్రబోధకులు ఫజ్లుర్రహ్మాన్ గారు మాట్లాడుతూ – మానవ జీవిత లక్ష్యాన్ని పలు గ్రంథాల వెలుగులో స్పష్టపర్చారు. మనిషి తన సృష్టికర్తను గుర్తించి, తగువైన రీతిలో ఆయన్ను సేవించుకోవడమే అతని అసలు లక్ష్యం అన్నారు. ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమం జనాబ్ కౌసర్ గారి తుది పలుకులతో ముగిసింది.



















telgo fbrvry.indd 16 2/12/12 4:09 PM

5వ పేజీ మిగతా భాగం

సామ, దాన, భేద, దండోపాయం

ఇస్లాం మదీనాలో క్రమక్రమంగా నిలదొక్కుకోసాగింది. అక్కడ ఇస్లాం చాలా వేగంగా వ్యాప్తి చెందుతుండటం చూసి మక్కా అవిశ్వాసులు జీర్ణించుకోలేకపోయారు. అందుచేత వారు పార్లమెంటులో ఓ సార్వత్రిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి అందరు సర్దారులతోపాటు సైతాను కుడా ఓ వృద్ధుని వేషంలో వచ్చాడు. చివరిగా **'మన తెగల్లో ఒక్కో తెగ నుండి కనీసం ఒక వ్యక్తి ముందుకు రావాలి. ఆ తర్వాత అందరూ కలిసి ఒక్కసారిగా ఖడ్గాలతో దాడి చేసి ముహమ్మద్ (స)ను మట్టు బెట్టాలి'** అని తీర్మానించారు. తర్వాత కాలం ఇటువంటి కుయుక్తులు, కుట్రలు కోకొల్లలుగా సాగాయి. అయినా అంతిమ విజయం సత్యానికే వరించింది. సత్యప్రవక్త ముహమ్మద్ (స) హృదయాల విజేతగా మక్కాలో ప్రవేశించారు.

ముస్లింలు కొన్ని శతాబ్దులపాటు ప్రపంచాన్ని పరిపాలించిన తర్వాత నేడు కాలం మళ్ళీ అక్కడికే వచ్చి ఆగింది. ఇస్లాం ధర్మం ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందడం చూసి జీర్ణించుకోలేని కొన్ని రాజ్యాలు, వ్యక్తులు సత్య ధర్మ ప్రవాహాన్ని అడ్డు కోవాలని తిరిగి మళ్ళీ ఆ ప్రాచీన అస్త్రాలైన **'సామ, దాన, భేద, దండోపాయా'**ల ను ప్రయోగిస్తున్నారు. వారి కుయుక్తుల్ని, కుట్రల్ని నిశితంగా పరిశీలిస్తే ఇస్లాంను అనుమానాస్పదంగా చిత్రీకరించేందుకు వారు అవలంబిస్తున్న మార్గాలు ఇవి –

1) ఇస్లాం మరియు ముస్లింలకు వ్యతిరేకంగా అపోహాల్ని, అపార్థాల్ని సృష్టించడం. 2) విద్యా రంగంలో సిలబస్ మార్పుచేర్పుల ద్వారా ముస్లింల చరిత్రను వక్రీకరించడం. 3) దివ్యఖుర్ఆన్ వచనాల్ని, ప్రవక్త (స) వారి ప్రవచనాల్ని వాటి నిజ స్థానం నుండి వేరు పర్చి పెడర్థాలు కల్పించడం. 4) ఇస్లాం పారభాషికాలను తప్పుడు అర్థాలు ఇవ్వడం. ఉ: జిహాద్ అంటే పవిత్ర యుద్ధం అని చెప్పడం. 5) అపనిందలు మోపడం. ఉ: ఇస్లాం కత్తి బలంతో వ్యాపించిందని నమ్మబలకడం. 6) ఇస్లాం ఆదేశాల్ని ప్రగతికి ప్రతిబంధకాలుగా పేర్కొనడం. ఉ: పరదా విషయంలో చేయబడుతున్న దుష్ప్రచారం. 7) ముస్లింలలోని అతివాదులను ప్రోత్సహించి ఇస్లాంపై బురద జల్లేందుకు ప్రయత్నించడం. ఉ: సల్మాన్ రష్దీ. 8) ఉగ్రవాద చర్యలు ఎక్కడ జరిగినా, ఎవరూ చేసినా ముందుగా ముస్లింలనే పేర్కొనడం. తర్వాత నిజానిజాలు తెలిసినా వాటికి అంత ప్రాధాన్యం ఇవ్వక పోవడం. 9) దేశ ప్రగతి కోసం, స్వాతంత్ర్యం కోసం ముస్లిం యోధులు సాగించిన పోరాటానికి పాఠ్య పుస్తకాల్లో చోటు కల్పించక పోవడం, ముస్లింల సేవల్ని విస్మరించి, ముస్లిం సైంటిస్టుల పేర్లు మార్చి ప్రచారం చేయడం. ఉ: ఈసా అలీ బదులు జేసు హాలి అన డం. 10) కొత్త కొత్త పారభాషికాలను సృష్టించి ఇస్లాంను ఒక ఫోబి యాగా చిత్రీకరించడం.

గత 11 సంవత్సరాలలో ఇస్లాంకు వ్యతిరేకంగా వ్రాయబడిన పుస్తకాల సంఖ్య **అక్షరాల** 2640 అంటే దుష్ప్రచారం ఏ స్థాయిలో జరుగుతున్నదో ఊహించవచ్చు. ఎన్ని కుట్రలు పన్నినా, మరెన్ని ఎత్తుగడలు వేసినా ఇస్లాం మాత్రం దినదిన ప్రవర్ధ మానంగా ప్రకాశిస్తూనే ఉంటుంది అని స్వయంగా అల్లాహ్ మాట ఇస్తున్నాడు: **"వారు అల్లాహ్ జ్యోతిని తమ నోటితో (ఊది) ఆర్పివేయాలని కోరుతున్నారు. అయితే అల్లాహ్ – అవిశ్వాసులకు ఎంతగా సహించరానిదైనా సరే – తన జ్యోతిని పరిపూర్ణం చేయకుండా వదలి పెట్టడానికి అంగీకరించడు. ఆయనే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ, సత్య ధర్మాన్నీ ఇచ్చి పంపాడు. ముష్రికులకు ఎంత అయిష్టంగా ఉన్నా సరే, ఇతర జీవన విధానాలపై దానికి ఆధిక్యతను వొసగటానికి".**

(తౌబా: 33)

పై పేర్కొనబడిన దశ కుయుక్తుల్లో అత్యధికంగా ప్రింటింగ్ మీడియా మరియు ఎలక్ట్రానిక్ మీడియాతో ముడిపడి ఉన్నవే. ప్రతి మూడు రోజుల్లో రెండు పుస్తకాలు ఇస్లాంకు వ్యతిరేకంగా వ్రాయబడుతున్నా, ఇంత జరుగుతున్నా ముస్లిం ప్రపంచం నిద్ర మత్తులోనే ఉండటం అత్యంత బాధాకరమైన విషయం. ఇస్లాం వాస్తవికతను తెలుయపర్చే పుస్తకం నెలకోక్కటి కూడా రాకపోవడం, దాని కోసం కట్టుదిట్టంగా పని చేసే ఒక వ్యవస్థ లేకపోవడం ముస్లిం సమాజ నిర్లక్ష్యానికి, ఏమరుపాటుకి ప్రబల తార్కాణం. ఇది చాలదన్నట్లు ఆధునిక రంగాల్లో ముందుకు దూసుకెళ్లే దమ్ము, ధైర్యమూ ఉన్న యువకుల్ని వ్యర్థ రాజకీయాల్లోకి లాగి, స్వార్థ, స్వల్ప ప్రయోజనాల కోసం తగువులాటల్లో, తగాదాల్లో వారి ప్రతిభాపాటవాలను దుర్వినియోగం చేయడం అత్యంత దారుణం! **'అల్లాహ్ త్రాడును గట్టి పట్టుకోండి. విభేదాల్లో పడి చీలి పోకండి'** అని దేవుడు పదే పదే పిలుపునిస్తుంటే వ్యక్తిగత పగలు ప్రతీకారాలు పెంచుకొని బ్రతకడం మిక్కిలి విచారకరం! పతనంలో ముందున్న మన మిగతా అన్నింటిలోనూ వెనుకబడి ఉండటానికి కారకులు ఎవరు?

ఇక వెబ్‌సైట్లు, బ్లాగర్ల విషయానికొస్తే జానాభా పరంగా ప్రపంచంలోనే రెండో అతి పెద్ద సంఖ్యలో ఉండి కూడా ఇక్కడ సయితం అన్ని మతాల వారికన్నా వెనుకబడి ఉన్నది మనమే. చూడండి –

గూగల్

యూదులు	బౌద్ధులు	క్రైస్తవులు	ముస్లింలు
3098	3788	92883	1953

యాహు

యూదులు	బౌద్ధులు	క్రైస్తవులు	ముస్లింలు
2961	594	25365	1418

అభిమాన సోదరులారా! ఆధారాల రీత్యా, ప్రమాణాల రీత్యా **'ఆధిక్యత'** అనేది ఇస్లాంకు ఎప్పటికీ ఉంటుంది. అయితే ముస్లింలు ధర్మపరాయణులుగా, రుజువర్తనులుగా వ్యవహరించిన నాడు ప్రాపంచికంగా కూడా వారికి ఆధిక్యత ప్రాప్తించింది. ఇప్పటికయినా సరే ముస్లింలు తమ ఆశయాన్ని గుర్తించి, విద్యా–వైద్య–వైజ్ఞానిక–రాజకీయ రంగాల్లో ప్రాతినిధ్యం వహిస్తూ, రుజుమార్గంలో పయనిస్తే ప్రాబల్యం ఖాయం. ఎందుకంటే ఏనాటికైనా అల్లాహ్ పక్షం వారే విజయం సాధిస్తారని దేవుడు వాగ్దానం చేసి ఉన్నాడు. ఇక అల్లాహ్ తోడ్పాటుకు కావలసిన అర్హత ముస్లింలమైన మనం సంపాదించుకోవడమే ఆలస్యం.

కారణం–

"ఏ జాతి అయినా సరే స్వయంగా తన మనోమయ స్థితిని మార్చుకోనంత వరకూ అల్లాహ్ కూడా దాని స్థితిని మార్చడు".

(అర్రాద్: 11)

telgo fbrvry.indd 17 2/12/12 4:09 PM

ఉదయభాను

సుభిక్షం - దుర్భిక్షం

గత సంచిక తరువాయి భాగం

వీరు కాదు; వృత్తిగా అడిగేవారి విషయంలో కాదు, విధి లేక అడిగేవారి సంగతే ఆలోచించాలి. కాల చక్రభ్రమణంలో పడి, కత్తెర బోనులాంటి అవస్థ వచ్చినప్పుడు, గత్యంతరం లేక నోరు విడిచి ఒకరిని అడగవలసి వచ్చిన వాళ్ళ సంగతే పరిశీలించాలి. పూటకు గుప్పెడు మెతుకులు లేక త్యాగడానికి సయితం గుక్కెడు నీళ్ళు కరువై కాలే కడుపులతోనే కాలం గడిపి గతిలేక, ప్రాణం నిలుపుకునేందుకు హరామ్ అని తెలిసి కూడా చచ్చిన గాడిద మాంసాన్ని అసహ్యించుకుంటూనే తిని ప్రాణాలు నిలుపుకునే ఆత్మాభిమాన కుటుంబాల గురించే విచారించాలి. పిల్లలు భరించలేని ఆకలితో 'అమ్మా బువ్వ' అని అలమటించిపోతుంటే చూడలేక, చూసి తాళలేక, మర్యాదగా కాలం గడుపుతూ, సిగ్గు వదలి చేయి చాచే వ్యక్తి సంగతే పరిశోధించాలి. అంటే, వీరు కష్టాలకు భయపడి ఇలా చేస్తున్నారని కాదు, మానసం గల ప్రతివాడూ, మర్యాదగా బ్రతికే ప్రతి వాడూ శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేస్తాడు; సాధ్యం కాదు. ఇతరుల సాయం అవశ్యకం అవుతుంది. అడగక తీరదు, అంటే; ఆత్మహత్య అన్న ఒక్క దారి తప్ప. అలాంటప్పుడు అడుతారే వాళ్ళ గురించి ఆలోచించాలి. అట్టి ఆత్మాభిమాని అడగటానికి సాహసించాడంటే అతను కనబరచిన త్యాగం అపారం. ఆ అవస్థ దుర్భరం, ఆ స్థితి సంఘంలో ఉండటం అవమానకరం. మానవజాతికే అది లజ్జాకారణం.

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"కొందరు దుమ్ముకొట్టుకుని (చూడటానికి అసహ్యంగా) కనబడతారు. వారిని గుమ్మం ఆవల నుంచే కసరి కొట్టడం జరుగుతుంది. కాని వారు గనక అల్లాహ్‌పై ప్రమాణం చేస్తే అల్లాహ్ వారి ప్రమాణాన్ని తప్పకుండా నిజం చేస్తాడు".** (ముస్లిం)

మరో హదీసులో ఇలా ఉంది: **"ఓ ఆదం పుత్రుడా! నీ దగ్గర మిగిలిపోయిన ధనాన్ని నువ్వు (మంచికై) ఖర్చు పెడితే అది నీకే మంచిది. దాన్ని ఎవరికి ఇవ్వకుండా ఆపుకుంటే దానివల్ల నీకే నష్టం. అవసరాలకు సరిపోయేటంత ధనాన్ని కూడబెట్టుకున్న పక్షంలో నీవు నిందార్హుడవు కావు".** (ముస్లిం)

'అల్ ఖల్ఖు అయాలుల్లాహ్'– సృష్టి మొత్తం దైవ కుటుంబం అంటామే; **'మొత్తం'** అన్న ఆ మాటను కనీసం ఒకే ఒక్క ప్రాంతానికైనా, జిల్లాకైనా, రాష్ట్రానికైనా, దేశానికైనా వర్తింపజేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామా? 'వారు వికలాంగులు, గ్రుడ్డివారు, ఏ పనీ చేయలేని వారైతే దానికి మేమేం చెయ్యాలి? అది వారి ఖర్మ' అని కొందరు ప్రబుద్ధులు ప్రశ్నిస్తారు. సరే, వారినే చెప్ప నివ్వండి! ఒక కుటుంబంలో ఉన్న వారంతా ఆరోగ్యవంతులేనా? ప్రయోజకులేనా? అప్రయోజకులు, ఎందుకూ పనికిరాని వారు కొందరు ఉంటారు కదా? వారికి సయితం తక్కిన వారిలాగా కూడు, గూడు, గుడ్డ ఎందుకిస్తాము? **'లేదే'** అన్న కొరత వారిలి లేకుండా ఎందుకు చేస్తాము? ఒక ఇంట్లో ఒక అవిటివాడో, గ్రుడ్డి వాడో పుట్టాడనుకోండి. కూడు, గుడ్డ మనలాగే అతనికి పెట్టమా? అతని అన్ని అవసరాలు తీర్చడానికి మనం కష్ట పడతామే. అతని ని పోషించడం మన ధర్మంగా ఎంచుతామే. ఆ ధర్మం–సంఘం, సమాజం విషయంలోకొచ్చే సరికి ఏమయ్యింది? ఇదీ ఒక కుటుం బం కాదా! అందులో ఒకరిని అడుక్కోనివ్వడం సిగ్గుచేటు కాదా! అలా తన అవసరాన్ని ఇతరుల ముందు పెట్టేవాడికి ఏమి ఇవ్వక పోగా **'ఛీ,ఫో!'** అని కసురుకున్న వారిని ఏమనాలి? **'యాచించే వారిని గద్దించకండి'** అని ఆ పరమప్రభువు చెబుతుంటే మనం ఇలా వ్యవహరించడం దైవధిక్కారం కాదా? **"తన కోసం ఇష్టపడేదాన్నే తన తోటి సోదరుని కోసం కూడా ఇష్టపడనంత వరకూ మీలో ఎవరూ (పరిపూర్ణ) విశ్వాసి కాజాలరు".** అని ప్రవక్త (స) హెచ్చరించి ఉంటే మనం ఇలా బిహేవ్ చెయ్యడం దైవ ప్రవక్త అవిధేయత కాదా?

'ధర్మం చెయ్యండి బాబూ!' అన్న అర్థన వినబడగానే దానికి మనకు తోచిన అర్థాన్ని మనం ఇచ్చుకుంటాము. దోసెడు ధాన్యం అని కొందరు, రూపాయి–రెండు రూపాయలని కొందరు భావిం చుకొని దాతల సరసరన నిలబడేందుకు తాపత్రయ పడుతుం టారు. నిజంగా ఆ పిలుపుకి అర్థం అదేనా? నిజం అది కాదు. వారు సంఘాన్ని, సమాజాన్ని, అందులో స్వచ్ఛంద సేవా సంస్థల లేబుల్‌తో చెలామణి అవుతున్న వాటిని, పెద్దల్ని, కలిమి–బలిమి గల వారిని హెచ్చరిస్తున్నారు. దీన దైవదాసులైన తమ పట్ల వారు వ్యవహరిస్తున్న వైఖరిని ఎండగడుతున్నారు. మరుపున పడ్డ విష యాన్ని సంఘం పట్ల వారి విద్యుక్త ధర్మాన్ని, కనీస బాధ్యతను జ్ఞప్తికి తెస్తున్నారు. సాటి జనుల పట్ల మన జగుప్సారకమైన ధోరణిని, నిర్లక్ష్య వైఖరిని ఎత్తి చూపుతున్నారు. సమాజంలో దట్టంగా పేరుకుపోయిన కరప్షన్స్‌ని కరెక్షన్ చేసి కరెక్ట్ చేయమని పిలుపునిచ్చి చెంప పెట్టు పెడుతున్నారు. కాగడా పట్టి మనలోని లోపాలను ఎత్తి చూపుతున్నారు.

ఓ సంఘ సంస్కర్తల్లారా! ధర్మం చర అంటూనే, మీరు మీ ధర్మాన్ని మూలన పడేస్తున్నారా? సత్యం వద అంటూనే సత్యం నోరు నొక్కేస్తున్నారా? **'తను కడుపారా భోంచేసి తన పొరుగువాని ఆకలి దాహాలను పట్టించుకోని వాడు నిజమైన విశ్వాసి కాజాలడు'** అన్న ప్రవక్త ముహమ్మద్ (స) వారి మాటను అప్పుడే మర్చి పోయారా? ఇప్పుడ యినా నిజాన్ని గ్రహించండి. మీరు నిర్వర్తించాల్సిన ధర్మాన్ని మీరు నిర్వర్తించండి అని ఒక మహోపన్యాసం చేస్తున్నారు.

telgo fbrvry.indd 18 2/12/12 4:09 PM

ఏమండి పండితులారా! లేని ప్రజలకు కదా ఇవ్వాలి? దీనికి మీరే మంటారు? **'ధర్మం అంటే దానం, దానం అంటే ధర్మం'** అన్నారే–భూదానం, గోదానం, హిరణ్యదానం, శాకదానం, కుషాంద దానం, గోగర్భ దానం, తులభార దానం – ఇన్నీ దానాల మధ్య నిజమైన దానం కానరాకుండా చేశారే! ఎవరిదీ పాపం? గతి లేక అడుక్కుతినేవారిదా? అడుక్కుతినే స్థాయికి దిగజార్చిన వారిదా?

ఇట్టి వ్యక్తుల జీవితానికి సంబంధించిన అసలు కేంద్రబిందువు వారి ఆర్థిక ప్రయోజనాలు, భార్యాపిల్లలు, ఇంకా వారి ప్రాపంచిక సౌఖ్యాలు అయి ఉంటాయి. కాని ఇతరులతో సంభాషించేటప్పుడు మాత్రం పారమార్థికత ఉట్టిపడేలా తాము దైవ ధర్మానికి, సంఘ సేవకు అంకితమైనవారిలా, దర్శోన్నతే, ప్రజాహితమే తమ మతం గా, సర్వేజనాః సుఖినోభవంతు అన్నదే తమ ప్రధమ కర్తవ్యమని చెబుతుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే– **"వారు తమ హృదయాలలో లేని మాటలను తమ నోటితో పలుకుతారు".**

(ఆలి ఇమ్రాన్: !67)

ఉదాహరణకు ఒక వ్యక్తి సమాజ తిరోగమనంపై, సంఘ దుస్థితి పై ఎంతో ఆర్ద్రంగా ప్రసంగాలు, ప్రకటనలు, వ్యాస పరంపరలు, ప్రచురణలు చేస్తూ ఉంటాడు. కానీ, తన నిజ జీవితంలో సమాజ శ్రేయం కోసం, మానవాభ్యుదయం కోసం ఆందోళన చెందుతూ ఒక్క రాత్రి అయినా గడిపి ఎరుగడు. తనకు పడక మీదకు చేరగానే ఒక్క నిద్ర తప్ప మరేమీ గుర్తుండదు కూడా. అశ్రుపూరిత నయనాలతో – నిశి రాత్రిన లేచి దైవ సమక్షంలో నిలబడి – **'ఓ అల్లాహ్! ఈ సమాజాన్ని, ఈ దేశాన్ని అభ్యుదయ బాటన నడిపించు. ఇక్కడి ప్రజల్లో సుహృద్భావాన్ని, సామరస్యాన్ని పెంపొందించు. సకల మానవుల సమస్యలను పరిష్కరించు'** అని వేడుకోడు. అంటే ఇట్టివారికి తన జాతి, మానవ జాతి గురించిన చింతన కంటే తన స్వార్థం గురించిన చింతనే, బాధే అధికంకా వేధిస్తూ ఉంటుంది. ఇట్టివారు లాంఛనాప్రాయంగా నియమనిష్టల విషయమై చాలా భేషైన ప్రమాణాలు చూపుతూ ఉంటారు. కాని తమ నిత్య జీవితంలో క్రియాశూన్యులుగానే దర్శనమిస్తుంటారు. ఇది తమ ఆంతర్యాల్లో లేని నీతిని తమ మాటల ద్వారా తమలో ఉందని ప్రజానికానికి నిరూపించడానికి పడుతున్న పాట్లే తప్ప మరేమి కాదు. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: **"వారు జరిపే అత్యధిక రహస్య మంతనాలలో ఏ మేలూ ఉండదు".** (నిసా: !!4)

"వారు (ఇవన్నీ) పరులకు చూపడానికే చేస్తారు. అతి సామాన్యమైన వాడుక వస్తువులను సయితం ఇవ్వడానికి నిరాకరిస్తారు".

(మాఊన్: 6,7)

ఒక పెద్ద మనిషి అడిగాడు అంటే, అంత దుర్వస్థ, దుర్భిక్ష స్థితి ఇంట్లో ఉందన్న మాట. ఆయన తన మనసులో అంత యాతన అనుభవించాడన్న మాట. అడగడంలో అంత ఆయాస పడ్డాడన్న మాట. అయితే అడగడమే, భిక్షాటనే వృత్తిగా చేసుకున్నవారు ఇందులో చేరరు. **'యాయవారం మా కుల వృత్తి'** అని చెప్పేవారు ఇందులో చేరరు. దేవుడే మమ్మల్ని అడుక్కొని బ్రతకమన్నాడని సిగ్గు వదిలి చెప్పేవారు ఇందులో జమ అవ్వరు. పంచ కేశాలు పెంచడం అనే ఆచారానికి భిన్నంగా పంచ కేశాలను క్షవరం

తాము తమ పిల్లలు ఒక గంటలో కేవలం వినోదాల కింద ఖర్చు పెట్టిన దానిలో అణు మాత్రం కాదు ఆ నిర్భాగ్యుడుకి లేదు పొమ్మన్నని. ఆడంబరాల కోసం, వేడుకల కోసం ప్రతి దినం తాను వ్యయం చేస్తున్న దానిలో నూరో వంతు కాదు ఆ అవసరార్థునికి కాదన్నని. అటువంటి నోరు, మనసు గలవాడికి మనిషి అని నామకరణం చేయడం ఎంత వరకు సబబో మనమున్నవారే నిర్ణయించాలి.

గావించుకుని, బ్రతికుండగానే మృతులలో చేర్చబడి పచ్చని తలపాగలతో పట్టభద్రులై, నెమలి ఈకలు చేత పట్టుకుని షరీయతు ఆదేశాలేవీ తమకు వర్తించవని చెబుతూ నమాజు చదవక, రోజాలు పాటించక మాదక ద్రవ్యాలను సేవిస్తూ, గంజాయి పీలుస్తూ సామాన్యులను సాంబ్రాణి పొగతో వంచిస్తూ అర చేతిలో స్వర్గం చూపేవారు ఇందులో చేరరు.

ఒకరి ముందు చేయి చాచడంకన్నా చావే నయం అనుకుంటూనే విషమయ పరిస్థితులకు లోనై బ్రతకలేక బ్రతికేవారినే ఇందులో చేర్చాలి. ఆత్మ కుటుంబం అనుభవిస్తున్న బాధ, వ్యధ అన్యులకు కనబడనీయకుండా గుట్టుగా బ్రతికేందుకు ప్రయత్నిస్తున్నవారినే ఇందులో చేర్చాలి. విద్యా, బుద్ధి, బలము, ఓపికా అన్నీ ఉన్నప్పటికీ ఒకరిని అడగకుండా ఆత్మాభిమానంతోనే అనేక అవస్థలు పడుతున్నవారినే ఇందులో చేర్చాలి. సమయం కలిసొస్తే తామే పది మందికి పెట్టగలిగినవారైనప్పటికీ **'దుర్భిక్షం'** చేత అడగక తప్పని దుర్వస్థకు వచ్చిన వారినే ఇందులో చేర్చాలి. అటువంటి ఆత్మాభిమాన ధనులు అడిగినప్పుడు, వారు అడిగారని, అర్థించారని భావించడం తప్పు, అధర్మం. నిజంగా వారు ఎదుటి వారికి ఒక మహదవకాశాన్ని ఇచ్చారన్న మాట గ్రహించాలి. అటువంటి ఆత్మాభిమానుల మానసం దెబ్బ తినకుండా సహాయం అందించగలిగితే వారి వల్ల లోకానికి ఎంత లాభం! వారి మేధా శక్తితో లోకానికి ఎంత ఉపకరించవచ్చును! ఎన్ని మహత్తర కార్యాలకు శ్రీకారం చుట్టవచ్చును! ఆ సమయంలోని ఆ స్వల్ప సహాయం సదుపాయం చేసినవాడిది కదా ఆ పుణ్యం, అ కీర్తి అంతానూ.

ఇటువంటి ఆత్మాభిమాన ధనుల పక్షం వహిస్తూ రేపు ప్రళయ దినాన అల్లాహ్ కలవారైన, కలిమి–బలిమి గలవారైన తన దాసులను నిలదీస్తాడు. దైవ ప్రవక్త ముహ్మద్ (స) ఇలా తెలియ జేశారు:

'నిశ్చయంగా మహోన్నతుడైన అల్లాహ్ ప్రళయ దినాన ఇలా అంటాడు: **"ఓ ఆదం కుమారుడా! నేను వ్యాధికి గురయినప్పుడు నువ్వు పరామర్శించలేదేమిటి?"** దానికి దాసుడు ఆశ్చర్యపోతూ, స్వామీ! నీవు సర్వలోకాలకు ప్రభువు, పరిపాలకుడవు, పరిపోషకుడవు, సంరక్షకుడవు. అలాంటప్పుడు నేను నిన్ను పరామర్శించడమేమిటి? అని విన్నవించుకుంటాడు. అప్పుడు అల్లాహ్ అతనితో – నా పలానా దాసుడు వ్యాధిగ్రస్థుడయ్యాడని తెలిసి కూడా నువ్వు తన్ని పరామర్శించడానికి వెళ్ళ లేదు. ఒకవేళ నువ్వెళ్లి అతన్ని పరామర్శించి ఉంటే అక్కడ నువ్వు నన్ను పొంది ఉండేవాడవన్న సంగతి నీకు తెలియదా? అని అంటాడు.

telgo fbrvry.indd 19 2/12/12 4:09 PM

'ఓ ఆదం పుత్రుడా! నేను నిన్ను అన్నం పెట్టమని అడిగితే నువ్వు నాకు అన్నం పెట్టలేదేమిటి?' అని ప్రశ్నిస్తాడు. దానికి దాసుడు 'ప్రభూ! సకల లోకాలకు పరిపోషకుడవు నీవు. అలాంటిది నేను నీకు అన్నం పెట్టడమేమిటి'? అని విన్నవించుకుంటాడు. దానికి అల్లాహ్, 'నా ఫలానా దాసుడు నిన్ను అన్నం (బాబూ! ధర్మం) పెట్టమని యాచించాడు. కాని (పెట్టగలిగే స్థితిలో నువ్వుండి కూడా) నువ్వతనికి అన్నం పెట్టలేదు. అప్పుడు నువ్వతనికి అన్నం పెట్టి ఉంటే దాన్ని నా దగ్గర పొంది ఉండేవాడవన్న విషయం నీకు తెలుయదా? అని అడుగుతాడు.

'ఓ ఆదం సంతానమా! నేను నిన్ను మంచి నీళ్లు అడిగాను. కాని నువ్వు నాకు మంచి నీళ్లు కూడా ఇవ్వలేదే' అనంటాడు. దానికి దాసుడు, దేవా! నీవు సకల లోకాలకు జీవనోపాధిని ప్రసాదించే వాడవు. నేను నీకు మంచి నీళ్లు త్రాపించడమేమిటి? అని విన్న వించుకుంటాడు. అప్పుడు అల్లాహ్ అతనితో, 'నా ఫలానా దాసుడు నిన్ను మంచి నీళ్లు అడిగితే నువ్వతనిక మంచి నీళ్లు కూడా ఇవ్వలేదు. నువ్వతనికి మంచి నీళ్లు ఇచ్చి ఉంటే దాన్ని నువ్వు నా దగ్గర పొంది ఉండేవాడవన్న విషయం నీకు తెలి యదా? అని అంటాడు. (ముస్లిం)

మరో హదీసులో ఇలా ఉంది: **'ఓ ఆదం కుమారుడా! నేను నగ్నంగా ఉన్నాను. నువ్వు నాకు బట్ట కప్పలేదేమిటి?** అని అడుగు తాడు. అందుకు దాసుడు, ప్రభూ! నువ్వు సకల లోకాల మేలును కోరేవాడవు. అలాంటిది నేను నీకు ఆచ్ఛాదనం తొడిగించడమే మిటి? అని ఆశ్చర్యపోతాడు. దానికి అల్లాహ్, నా ఫలానా దాసుడు నగ్నంగా ఉన్నాడు అని నీకు తెలిసి కూడా నువ్వతనికి ఆచ్ఛాదనాన్ని ఇవ్వలేదు. ఒకవేళ నువ్వతనికి బట్టలు తొడిగించి ఉంటే నన్ను అక్కడ పొందేవాడవన్న విషయం తెలీదా నీకు?' అని ప్రశ్నిస్తాడు అల్లాహ్.

అదే **'లేదు,పో'** అన్న మూడు అక్షరాల ఫలితం ఏమవుతుందో ఊహించారా? ఆ వ్యక్తి ఆత్మాభిమానంతో చచ్చిపోతాడు. ఒకసారి తస్కారం జరిగాక మళ్ళీ దానికై సాహసించడు. తన బుద్ధి బలం చేతనూ, తన శక్తి చేతనూ మానవ అభ్యుదయానికి తోడు పడ దగిన ఒక వ్యక్తి బలవంతంగా అసువులు బాసాడు. అతని విజ్ఞానం వల్ల లాభం, అతని కౌశలం వల ఫలితం ప్రపంచానికి దక్కకుండా పోయింది. అతనికీ, అతని కుటుంబానికే కాకుండా సర్వ మానవాళికి తీరని లోటు మిగిల్చింది. జగత్తుకే ఒక మహా ఉపద్రవబం తెచ్చి పెట్టింది.

దీనంతటికి కారణం **'కలవాడు' లేదు పొమ్మన్నాడు'.** ఒక్క రూక కాదు-నిజంగా అది ఒక ఈక. ఇవ్వడానికి సందేహించాడు. అల్ప సహాయం చేయడానికి చేతులు వచ్చాయి కావు. పైగా **"ఇటువంటి వారితో అల్లాహ్ ప్రసాదించిన దానిలో నుంచి కొంత ఖర్చు చేయండి అని అన్నప్పుడల్లా, ఈ తిరస్కారులు విశ్వాసులతో, మేము వారికి ఎందుకు తినిపించాలి? అల్లాహ్ తలిస్తే స్వయంగా వారికి అన్నం పెట్టగలడు కదా!'** (దేవుడు తలిస్తే వారిని దరి ద్రులుగా ఉంచేవాడే కాదు. అలాంటప్పుడు మేము ఈ దరిద్రులకు సహాయపడి దైవాభిమతానికి వ్యతిరేకంగా ఎందుకు ప్రవర్తించాలి) **అని వారు పెడసరిగా జవాబిస్తారు".** (యాసీన్: 47)

ఒక పదవ వంతు కాదు, ఆ ఆత్మాభిమానధనులు అడిగినది. తాము తమ పిల్లలు ఒక గంటలో కేవలం వినోదాల కింద ఖర్చు పెట్టిన దానిలో అణుమాత్రం కాదు ఆ నిర్భాగ్యుడుకి లేదు పొమ్మ న్నది. ఆడంబరాల కోసం, వేడుకల కోసం ప్రతి దినం తాను వ్యయం చేస్తున్న దానిలో నూరోవంతు కాదు ఆ అవసరార్థునికి కాదన్నది. అటువంటి నోరు, మనసు గలవాడికి మనిషి అని నామకరణం చేయడం ఎంత వరకు సబబో మనసున్నవారే నిర్ణ యించాలి. పేరు కోసం, ప్రకటన కోసం అని కోట్లకి కోట్లు ఖర్చు చేసిన ఈ దాత వట్టి రోత కాదా? నిజంగా చెప్పాలంటే, అడ వులు, సముద్రాలు, పర్వతశ్రేణులు - ఇవేవి భూమికి బరువు కాదు. ఇటువంటి ధనికులే భూమికి భారం.

గృహశోభ, గృహ ప్రవేశానికి, గృహశాంతికి, గృహవాస్తుకని లక్షలకిలక్షలు ఖర్చు పెట్టే మనిషి, భూత దయ కోసం, వృక్ష మోక్షం కోసం వేలకి వేలు ఖర్చు పెట్టే మనిషి, అందులోనే మోక్షం చూరగొనాలనుకుంటాడు. మూర్ఖ బుద్ధి! జంతువులలోకెల్లా మహా జంతువు, సృష్టిరాసులలోకెల్లా శ్రేష్ఠుడు మనిషి; వారిలో మానసం గలవాడు మణిపూస, సోదర మానవుడు. అలాంటి ఉత్కృష్ట జీవి అష్టకష్టాలు పడుతూ, అష్ట దారిద్ర్యాల్ని అనుభవిస్తూ, అడిగి లేదని పించుకున్న యాతనను భరిస్తూంటే, ఇతనికి నిజంగా భూత దయ ఉందా? ఆ మాటకు, ఈ రోతకు ఎంత దూరం? ఈ ఆడంబరం అంతా పేరు కోసం ప్రాకులాడటం, మెప్పు కోసం అర్రులు చాచ డం, విలాసాలు, ఖులాసాల కోసం దేవులాడటం. అంతే కాని ధర్మం ఆచరించడానికి కాదు.

ఇవన్నీ తెలిసిన అల్లాహ్ ప్రతిదాంట్లో స్వార్థాన్ని చూసే మనల్ని ఉద్దేశించి మీరు చేసే సహాయం వృధా పొయిందని బాధపడన వసరం లేదు, మీరు ఇచ్చిన ప్రతి పైసా నా దగ్గర మీరు నాకిచ్చిన రుణంగా వ్రాసుకోబడుతుందని తెలియజేస్తున్నాడు: **"నిశ్చయంగా దానధర్మాలు చేసే పురుషులు, దానధర్మాలు చేసే స్త్రీలు, అల్లాహ్ కు (చిత్తశుద్ధితో) రుణం ఇచ్చేవారు- వారు ఇచ్చినది వారి కొరకు పెంచబడుతుంది. మరి వారి కొరకు గౌరవ ప్రదమైన ప్రతిఫలం ఉంది".** (అల్ హదీద్: !8)

అంటే, ఒక్కో సత్కార్యానికి కనీసం పదింతల పుణ్యం అంతకన్నా అధికంగా 700 రెట్లు ప్రసాదించబడుతుంది. దైవ చిత్తమయితే ఈ పుణ్యం ఒక్కోసారి అంతకన్నా ఎక్కువగా కూడా ఉంటుంది. అయితే అది ఇచ్చేవాడి చిత్తశుద్ధిపై, పుచ్చుకునే వాడి దుర్భిక్ష అగత్య స్థితిపై ఆధారపడి ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే-

"తాము అమిత అవసరంలో ఉన్నప్పటికీ తమపైన వారికే ప్రాధాన్యతనిస్తారు. వాస్తవానికి తమలోని స్వార్థప్రియత్వం (పేరాశ, పిసినారితనం) నుండి రక్షించబడినవారే కృతార్థులు".

(హష్ర్: 9)

telgo fbrvry.indd 20 2/12/12 4:09 PM

అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి జీవితం ఒక చూపులో

పేరు: ముహమ్మద్ మరియు అహ్మద్

జననం: క్రీ శ, 571 ఫీల్ సంఘటన జరిగిన యాభై లేక యాభై ఐదు రోజుల తర్వాత అనగా రబీవుల్ అవ్వల్ మాసం తొమ్మిదో తేదీన వసంత ఋతువులో మక్కా నగరంలో సోమవారం నాడు దైవ ప్రవక్త (స) జన్మించారు.

4 లేక 5వ ఏట: నాలుగు లేక ఐదేళ్ళ ప్రాయంలో ఆయన బనూ సాద్ తెగవారిలో ఉన్నప్పుడు తొలి గుండె సర్జరీ మరియు హృదయ శుద్ధి సంఘటన జరిగింది.

6వ యేట: ఆరేళ్ళ ప్రాయంలో ప్రవక్త (స) వారి తల్లి ఆమినా పరమ పదించారు.

16వ యేట: పదహారేళ్ల ప్రాయంలో "హిల్‌ఫుల్ ఫుజూల్" అనే ఒక సంఘ సంస్కరణా కార్యంలో పాల్గొన్నారు.

25వ యేట: పాతికేళ్ళ వయస్సులో హజ్రత్ ఖదీజా (రజి)ను వివాహమాడారు.

35వ యేట: ముప్పై ఐదేండ్ల వయస్సులో కాబా గృహ పునర్నిర్మాణ సందర్భంగా హజ్రె అస్వద్ (నల్లరాయి)ని ప్రతిస్థాపించే విషయమై తిరుగులేని తీర్పునిచ్చి మక్కా నగరాన్ని అంతర్యుద్ధం నుండి కాపాడారు.

41వ యేట: నలభై సంవత్సరాల ఆరునెలల పన్నెండు రోజులకు అనగా రమజాన్ మాసం 21 వ తేది సోమవారం నాడు జిబ్రయీల్ దూత తొట్ట తొలిసారిగా దైవవాణిని తీసుకొని 'హిరా' కొండ గుహకు వచ్చారు. అప్పుడే ఆయనకు నబువ్వత్ (దైవదౌత్య బాధ్యత) అనుగ్రహించబడింది.

నబువ్వత్ శకం 6వ సంవత్సరం: అబూ జహల్ ఆయన్ని హత్య చేయజూశాడు.

నబువ్వత్ శకం 7వ సంవత్సరం: నలభై ఏడేళ్ళ వయసులో సంఘం నుండి బహిష్కరించబడి "షేబె అబీ తాలిబ్" అనే కనుమ లో ఆంక్షలతో కూడిన జీవితం గడిపారు.

నబువ్వత్ శకం 10వ సంవత్సరం: "షేబె అబూతాలిబ్ " నిర్బంధ జీవితం నుండి విముక్తులయ్యారు. ఆ సంవత్సరమే భార్య హజ్రత్ ఖదీజా (ర), బాబాయి అబూ తాలిబ్‌లు మరణించారు. హజ్రత్ సౌదా (ర)ను వివాహం చేసుకున్నారు. ధర్మ ప్రచార నిమిత్తం తాయెఫ్ నగరాన్ని పర్యటించారు.

నబువ్వత్ 11వ సంవత్సరం: తొలిసారిగా మదీనా నగరానికి చెందిన ఆరుగురు అదృష్టవంతులు ఇస్లాం స్వీకరించారు. హజ్రత్ ఆయిషా (ర)తో వివాహం జరిగింది.

నబువ్వత్ శకం 12వ సంవత్సరం: రెండవ హృదయ శుద్ధి సంఘటన, మేరాజ్ (గగన యాత్ర) సంఘటన, ఇంకా రెండవ ఉఖ్బా ఒప్పందం లాంటి ముఖ్యమైన సంఘటనలు జరిగాయి.

నబువ్వత్ శకం 13వ సంవత్సరం: అనగా– (హిజ్రత్ శకం మొదటి సంవత్సరం) సఫర్ మాసం 26వ తేదీన ఖురైషులు సామూహికంగా దైవప్రవక్త(స)ను హతమార్చాలని నిర్ణయం గైకొన్నారు. సఫర్ మాసం 27వ తేదీన ఆయన మక్కా నగరానికి వీడ్కోలు పలికి అక్కడి నుండి పలస పోయారు. రబీవుల్ అవ్వల్ పన్నెండో తేది శుక్రవారం నాడు మదీనాకు వెళ్ళి అక్కడ అబూ అయ్యూబ్ అన్సారీ (ర) ఇంటి ముందు ఆగారు.

హి.శ. 2వ సంవత్సరం: బవా యుద్ధం, బవాత్ యుద్ధం, సఫ్‌వాన్ లేక బద్రె ఊలా యుద్ధం, జుల్ అషీరా యుద్ధం, బద్రుల్ కుబ్రా యుద్ధం, బనూ ఖైనుఖా యుద్ధం, సవీఖ్ యుద్ధం, బనూ సలీం యుద్ధం లాంటి ముఖ్య యుద్ధాలు జరిగాయి, దైవప్రవక్త(స) ను హతమార్చటానికి మూడో సారి విఫల ప్రయత్నం జరిగింది.

హి.శ 3వ సంవత్సరం: గిత్‌ఫాన్ యుద్ధం, నజ్రాన్ యుద్ధం, ఉహద్ యుద్ధం, హమ్రావుల్ అసద్ యుద్ధాలు జరిగాయి. హఫ్సా (ర), జైనబ్ బిన్తె ఖుజైమా (ర)లతో వివాహం జరిగింది.

హి.శ. 4వ సంవత్సరం: రజీ, బీరె మవూనా లాంటి విషాద సంఘటనలతోపాటు బనూ నజీర్ ముట్టడింపు, బద్రుల్ ఉఖ్రా యుద్ధాలు జరిగాయి. ఉమ్మె సలమా (ర)తో వివాహం జరిగింది. జైనబ్ బిన్తె ఖుజైమా (ర) తనువు చాలించారు.

హి.శ. 5వ సంవత్సరం: దూమా అల్ జుందల్, బనూ ముస్తలిక్, అహ్‌జాబ్ లేక కందక యుద్ధం, బనూ ఖురైజా యుద్ధాలు జరిగాయి. హజ్రత్ ఆయిషా (ర) మీద అపనిందలు మోపటం జరిగింది. జైనబ్ బిన్తె జహష్, జువైరియాలతో వివాహం అయింది. ఉరైనీన్ యుద్ధం, హుదైబి యా ఒప్పందం లాంటి సంఘటనలు జరిగాయి. ఉమ్మె హబీబా (ర)తో వివాహం జరిగింది.

హి.శ. 7వ సంవత్సరం: రాజుల, చక్రవర్తుల పేర ఇస్లాం సందేశ లేఖలు వ్రాయించారు. గాబా, ఖైబర్, వాదియుల్ ఖురా, జాతుర్రిఖా యుద్ధాలు జరిగాయి. ఆయనకు మేక మాంసంలో విషం కలిపి తినిపించే ప్రయత్నం జరిగింది. సఫియా, మైమూనా (ర)లను వివాహమాడారు. తన అనుచరులతో పాటు ఖజా ఉమ్రా నెరవేర్చారు.

హి.శ. 8వ సంవత్సరం: మౌతా, మక్కా విజయం, హునైన్ లేక హవాజిన్, తాయిఫ్ యుద్ధాలు జరిగాయి. కూతురు జైనబ్ (ర) కుమారుడు ఇబ్రాహీమ్‌లు చనిపోయారు.


హి.శ. 9వ సంవత్సరం: తబూక్ యుద్ధం జరిగింది. ఎన్నో బృందాలు ఇస్లాం స్వీకరించటానికి ఆయన సన్నిధికి వచ్చాయి.

హి.శ. 10వ సంవత్సరం: అంతిమ హజ్ చేశారు.

హి.శ. 11వ సంవత్సరం: సఫర్ మాసం 29వ తేదీ సోమవారం నాడు వ్యాధికి గురయ్యారు. రబీవుల్ అవ్వల్ పన్నెండో తేది సోమవారం నాడు ప్రొద్దెక్కిన తర్వాత ఆయన శుభాత్మ దేహ పంజరాన్ని వీడి పోయింది. అప్పటికి ఆయన వయస్సు 63 సంవత్సరాల నాలుగు రోజులు.

రబీవుల్ అవ్వల్ మాసం పధ్నాలుగో తేది బుధవారం నాటి రాత్రి హజ్రత్ ఆయిషా (ర) గారి కుటీరంలో ఆయనకు ఖనన సంస్కారాలు జరిపారు.

telgo fbrvry.indd 21 2/12/12 4:09 PM



జీవితాన్ని మార్చగలిగే ప్రశ్నలు

1) నిజంగా దేవుడు ఉన్నాడా?
2) మీరు జీవితంలో నిజమైన దైవం పట్ల విశ్వాసం అవశ్యం అనుకుంటున్నారా?
3) మన ఆరాధ్య దైవం సత్య దేవుడని మనకు ఎలా తెలుస్తుంది?
4) నకిలీ దేవుళ్ళని, నిజ దైవాన్ని వేరు పరచ్చడానికి ఏది ప్రమాణం కాగలదు?
5) మనం దైవాన్ని చూడగలమా?
6) దైవానికి ఆకలిదాహాలు, అలసిపోవడాలు ఉంటాయా?
7) దేవుడు తప్పు చేయడం గానీ, మరచిపోవడం గాని జరుగుతుందా?
8) దేవుడు రోగ బారిన పడతాడా?
9) ఈ సృష్టిలో దైవ జ్ఞాన పరిధిలో రానిదంటూ ఏదైనా ఉందా?
10) దైవానికి భార్యాపిల్లలుగానీ, తల్లిదండ్రులుగాని ఉన్నారా?
11) దేవుడు పాపిష్టులకి బదులు పుణ్యాత్ములను బలి తీసుకుంటాడా?
12) దైవానికి ఓటమి, మరణం సంభవిస్తుందా?
13) పవిత్రంగా భావించి మనం చదివే గ్రంథాలు నిజంగా దైవం అవతరింపజేసినవేనా?
14) దేవుని పుస్తకం తప్పులను కలిగి ఉంటుందా?
15) దేవుళ్ళు ఎంత మంది? అనేక మంది దేవుళ్ళు ఉండటం సంభవమేనా?
16) ఒక దేవుడు అన్య దేవుళ్ళను పూజించడం జరుగుతుందా?
17) దేవుడికి ఇతరుల సహాయ అవసరం ఉంటుందా?
18) దేవుడు సాతాను ప్రలోభాలకు గురికాగలడా?
19) దేవుడు ఎక్కడ ఉన్నాడు?
20) దేవుడ్ని తయారు చేయడం సాధ్యమేనా?
21) మనల్ని పుట్టించిన వాడు ఎవడో నిజంగా మనకు తెలుసా?
22) ప్రతి మనిషి తన ఆధ్యాత్మిక లక్ష్యాన్ని తానే నిర్ణయించుకుంటాడా? లేదా దాన్ని నిర్ణయించేది దేవుడా?
23) మనశ్శాంతిని ఎలా పొందగలం?
24) స్వర్గనరకాలు వాస్తవంగా ఉన్నాయా?
25) నరక మోక్షం స్వర్గ ప్రాప్తి ఎలా సాధ్యం అనుకుంటున్నారు?

మీరు మీ అభిప్రాయాలను మాతో షేర్ చేసుకోవచ్చు.
వివరాల కోసం సంప్రదించండి:
97258148, 97248933, 66415927, 65080410, 99667860, 60705344, 22511301.

telgo fbrvry.indd 22 2/12/12 4:09 PM